

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి నుంచి రూ.1.43 కోట్లు దోపిడీ

- మనీ లాండరింగ్ కేసు నమోదైందంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్
- అరెస్టు చేయడానికి ముంబై నుంచి పోలీసులు వస్తున్నారంటూ బెదిరింపులు

... వివరాలు మెయిన్‌లో

ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ ఆరా!

- అనకాపల్లి, పరవాడ, సబ్బవరం తహసీల్దారు కార్యాలయాల్లో తనిఖీలు
- మూడు బృందాలతో రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలన
- భూ సమీకరణలో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడినట్టు ఆరోపణలు
- బినామీల పేర్లతో వీఎంఆర్‌డీఏ నుంచి రిటర్న్ ప్లాట్లు పొందినట్టు ఫిర్యాదులు
- అక్రమాల కూపీ లాగుతున్న సీఐడీ అధికారులు



అనకాపల్లి తహసీల్దారు కార్యాలయం వద్ద వాహనం ఎక్కుతున్న సీఐడీ అధికారులు

అనకాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ ప్రభుత్వం హయాంలో జగనన్న కాలనీల పేరుతో జరిగిన ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ ఆరా తీస్తోంది. సీఐడీ అధికారి నాగేంద్ర భూపాల్ నేతృత్వంలో మూడు అధికారుల బృందాలు అనకాపల్లి, సబ్బవరం, పరవాడ తహసీల్దారు కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించి పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సీఐడీ అధికారుల సోదాలు రెవెన్యూ వర్గాల్లో కలకలం రేపాయి.

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలకు ల్యాండ్ పూలింగ్ పేరుతో రైతుల నుంచి పెద్దఎత్తున భూములను సమీకరించింది. వైసీపీ ప్రభుత్వం 2021-22లో జారీ చేసిన జీవో నంబరు 72 మేరకు రెవెన్యూ అధికారులు జగనన్న కాలనీలకు ల్యాండ్ పూలింగ్ పేరుతో అనకాపల్లి మండలంలోని 11 గ్రామాల్లో సుమారు 900 ఎకరాల భూములను రైతుల నుంచి సేకరించారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములను ఇచ్చిన రైతులకు అసైన్డ్ భూమి అయితే ఎకరాకు 18 సెంట్లు, ఆక్రమిత భూమి అయితే ఎకరాకు తొమ్మిది సెంట్లు చొప్పున వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన ప్లాట్‌లను కేటాయించారు. జిల్లాకు చెందిన ఒక మంత్రి అండదండలతో కొంతమంది వైసీపీ నాయకులు బినామీ పేర్లతో ల్యాండ్ పూలింగ్‌లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడినట్టు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. వాస్తవానికి ప్రభుత్వం భూములు తీసుకోకపోయినా.. కొన్ని గ్రామాల్లో వైసీపీ నేతలు బినామీ పేర్లతో తమ భూములు ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చినట్టు రికార్డుల్లో చూపి వీఎంఆర్‌డీఏ ప్లాట్‌లు పొందినట్టు తెలిసింది. అనకాపల్లి మండలం కోడూరు, కుంచంగి, వేట జంగాలపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో ఈ తరహాలో వీఎంఆర్‌డీఏ ప్లాట్లు చేజిక్కించుకున్నట్టు సమాచారం.

అనకాపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతులను... నాడు జిల్లాకు చెందిన ఒక మంత్రి అనుచరులు బెదిరించి భూములు లాక్కున్నారు. అదే విధంగా డి.పట్టా భూములను తక్కువ ధరకు రైతులతో అగ్రిమెంట్‌లు రాయించుకొని ల్యాండ్‌పూలింగ్ రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేయించుకున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ల్యాండ్ పూలింగ్ అక్రమాల వ్యవహారంలో కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు, వైసీపీ నాయకులు సహకారం అందించారు.

మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదుతో...

ల్యాండ్ పూలింగ్ మాటున వైసీపీ నాయకులు పాల్పడిన అక్రమాలపై విచారణ జరిపించాలని అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి డీజీపీకి ఫిర్యాదు చేశారు. అయితే అప్పుడు వైసీపీ అధికారంలో వుండడంతో ... మిగతా 8వ పేజీలో

ఆర్టీసీ బస్సు నుంచి జారిపడి డిప్లొమా విద్యార్థి మృతి

కశింకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :



మణికంఠ (ఫైల్ ఫొటో)

మండలంలోని తాళ్లపాలెం జంక్షన్ వద్ద ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు నుంచి జారీ పడి పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థి మృతి చెందాడు. మాకవరపాలెం మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఇతను.. మంగళవారం సాయంత్రం తరగతులు ముగిసిన తరువాత ఇంటికి తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి.

ఎలమంచిలి మండలం షేకిళ్లపాలెం గ్రామానికి చెందిన అగ్రహారపు మణికంఠ (18) మాకవరపాలెంలో ఉన్న అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం డిప్లొమా చదువుతున్నాడు. రోజూ ఇంటి నుంచి ఆర్టీసీ బస్సులో కళాశాలకు వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం తరగతులు ముగిసిన తరువాత మాకవరపాలెంలో నర్సీపట్నం-ఎలమంచిలి పల్లెవెలుగు బస్సు ఎక్కాడు. కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపైకి మలుపు తిరిగే క్రమంలో బస్సు డోర్ వద్ద నిల్చుని ప్రయాణిస్తున్న మణికంఠ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఆ వెంటనే బస్సు వెనుక చక్రాలు అతని మీద నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రెప్పపాటులో జరిగిన ఈ సంఘటనతో బస్సులో వున్న సహచర విద్యార్థులు, ప్రయాణికులు ఖిన్నులయ్యారు. ప్రమాదం గురించి తెలుసుకున్న మణికంఠ తల్లిదండ్రులు చిన్నయ్యనాయుడు, శివలక్ష్మి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. విగతజీవిగా మారిన కుమారుడిని చూసి భోరున విలపించారు. సీఐ అల్లు స్వామినాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

ఫార్మా కంపెనీల ఇష్టారాజ్యం

- కనీస నిబంధనలు పాటించని వైనం
- తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మారని తీరు
- ఎవరిది లోపం?
- ఈ మారణ హోమానికి అంతం లేదా?
- పర్మిషన్ లేకుండా 'ఠాగూర్' ఫార్మాలో హెచ్ఐవీ, హెపటైటిస్-బి చికిత్సకు వినియోగించే మందు తయారు చేస్తున్నప్పుడే ప్రమాదం

అనుమతులు లేకుండానే మందుల తయారీ



ఠాగూర్ ఫార్మాలో ప్రమాదం జరిగిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీలు బరితెగించి వ్యవహరిస్తున్నాయి. ఠాగూర్ ఫార్మా ప్రమాదం ద్వారా ఇది స్పష్టమైంది. ఆ కంపెనీలో వారం క్రితం విషవాయువులు వెలువడి ఇద్దరు కార్మికులు మరణించగా, మరో 27 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా హెచ్ఐవీ, హెపటైటిస్-బి వ్యాధులకు వినియోగించే యాంటీ రిట్రోవైరల్ మందు (లామివుడీన్) తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు విచారణలో తేలింది. ఈ విషయం ఇప్పటివరకూ బయటకు రాలేదు. కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాశ్ వెళ్లారు. ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు కూడా ఫ్యాక్టరీని సందర్శించారు. కానీ ఎవరూ ఈ విషయంపై దృష్టిపెట్టలేదు.

అత్యంత కీలకమైన మందులు అనుమతులు లేకుండా తయారు చేస్తున్నారంటే...కంపెనీలపై పర్యవేక్షణ లేదని స్పష్టంగా అర్థమవుతోంది. ఎటువంటి పర్యవసానాలు ఎదురైనా ప్రభుత్వపరంగా పెద్దగా ఇబ్బంది ఉండబోదని యాజమాన్యాలు భావిస్తున్నట్టుగా ఉంది. అందుకే ఇలా కీలకమైన మందులను నైపుణ్యం లేని సిబ్బందితో, సరైన పర్యవేక్షణ, భద్రత కొరవడిన ప్రాంగణాల్లో తయారు చేస్తున్నారు. వరుస ప్రమాదాలు జరుగుతున్నా, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు మొత్తుకుంటున్నా యాజమాన్యాలు పట్టనట్టుగానే ఉంటున్నాయి. ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాద ఘటనలో కొరియా దేశానికి చెందిన యాజమాన్య ప్రతినిధులను అరెస్టు చేసి జైలుకు పంపించారు. కానీ ఆ తరువాత ప్రమాదాలు జరిగిన ఎసెన్షియా యాజమాన్యంపై గానీ, ఇతర ఫార్మా కంపెనీలపై గానీ ఇప్పటివరకూ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బాధితులకు నష్టపరిహారం ఇప్పించి యథాతథంగా ఉత్పత్తులు చేసుకోవడానికి పాలకులు అనుమతి ఇస్తున్నారు. అదే యాజమాన్యాలకు అలుసుగా మారినట్టు ప్రచారం జరుగుతోంది.

ఠాగూర్ యాజమాన్యం యూనిట్-3లో 17 రకాల మందుల తయారీకి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంది. అందులో లామివుడీన్ లేదు. కానీ ఉత్పత్తి చేస్తున్నారు. మొదటి బ్యాచ్ మందు తయారు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇలా అనుమతులు లేకుండా అత్యంత కీలకమైన మందులు తయారుచేయవచ్చునా?, ఇలాంటి అంశాలను అధికారులు తనిఖీల ద్వారా గుర్తించి చర్యలు చేపట్టరా?...అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పెట్టుబడులు, ఉపాధి అనే అంశాల ఆధారంగా ఫార్మా కంపెనీలు ఏమి చేస్తున్నా పాలకులు పెద్దగా స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ వరుస ప్రమాదాలపై హై లెవెల్ కమిటీ విచారణ జరుగుతున్న సమయంలోనే అవే మళ్లీ పునరావృతం కావడం మరో విశేషం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందా? కఠిన చర్యలు తీసుకుంటుందా?...అనేది చూడాలి. ఇలాంటి అనుమతి లేని ఉత్పత్తులు ఇంకా ఎక్కడెక్కడ జరుగుతున్నాయో గుర్తించి, తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పాఠశాలలకు రక్షణ!

చురుగ్గా ప్రహరీ గోడల నిర్మాణం

- తొలి దశలో 142 స్కూళ్లకు రూ.19.98 కోట్లు మంజూరు
- ఇప్పటికే 44 పాఠశాలల్లో నిర్మాణాలు ప్రారంభం
- ఈ నెలాఖరునాటికి అన్నింటినీ పూర్తి చేస్తామంటున్న ఎస్ఎస్ఏ అధికారులు



ఎస్.రాయవరం మండలం కె.అగ్రహారం ప్రాథమిక పాఠశాల ఆవరణ చుట్టూ నిర్మించిన గోడ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణ పనులు జోరందుకున్నాయి. తొలి విడత 142 పాఠశాలకు ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రభుత్వం రూ.19.98 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే 44 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయి.

గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందే తప్ప పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదు. పలు పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా వుండిపోయాయి. ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ప్రహరీ గోడల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించడమే తప్ప నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ... మిగతా 8వ పేజీలో

అసంక్రమిత వ్యాధులకు చెక్

జిల్లా అంతటా స్ర్కీనింగ్ పరీక్షలు

- బృహత్తర కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం
- ఇంటింటికీ వెళుతున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది
- జిల్లా వ్యాప్తంగా 522 బృందాలు ఏర్పాటు
- 18 ఏళ్లు నిండిన వారందరికీ ఆరోగ్య పరీక్షలు
- జిల్లాలో 13,55,836 మంది ఉన్నట్టు గుర్తింపు
- ఇంతవరకు 76,663 మందికి స్ర్కీనింగ్ పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

నర్సీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో అసంక్రమిత(ఎన్‌డీసీ) వ్యాధుల మరణాలు తగ్గించడానికి కూటమి ప్రభుత్వం బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వచ్చాము.. వైద్య పరీక్షలు చేశాము.. అన్నట్టు కాకుండా ప్రతి ఒక్కరినీ పక్కాగా స్ర్కీనింగ్ చేయాలని వైద్య, ఆరోగ్య శాఖను ఆదేశించింది. దీంతో ఒక్కో టీమ్‌లో ఎఎన్ఎం, సీహెచ్‌వో, ఆశా కార్యకర్తతో మొత్తం 522 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక బృందం రోజుకి ఐదు గృహాలను సందర్శించి కుటుంబంలో 18 ఏళ్లు నిండిన వారందరికీ అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది జిల్లాలో ఇంటింటికి వెళ్లి అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ) స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత నెల 14 తేదీన ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) స్ర్కీనింగ్ మొదలు పెట్టారు. జిల్లాలో 5,72,459 కుటుంబాల్లో 18 ఏళ్లు నిండినవారు 13,55,836 ఉన్నట్టు గుర్తించారు. ఎఎన్ఎం, సీహెచ్‌వో, ఆశా కార్యకర్తతో కూడిన బృందాలు ఇంటింటికి వెళ్లి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ స్కీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. గుండె సంబంధిత, దీర్ఘ కాలిక ఊపిరితిత్తుల వ్యాధులు, క్యాన్సర్, రక్తపోటు, మధుమేహ పరీక్షలు వంటివి చేస్తున్నారు. ముందుగా ... మిగతా 8వ పేజీలో

దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అవగాహన



నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ స్ర్కీనింగ్‌ను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నామమాత్రంగా కాకుండా పక్కాగా పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరికి స్ర్కీనింగ్ చేస్తున్నారు. గుండె, ఊపిరితిత్తులకు సంబంధించి దీర్ఘకాలిక వ్యాధుల పట్ల అవగాహన పెంచుతున్నాం.

డాక్టర్ జ్యోతి, డిప్యూటీ డీఎంహెచ్‌వో

జల వనరుల శాఖ ఎస్ఈగా రామ్‌గోపాల్

విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ విశాఖ సర్కిల్ ఎస్ఈగా కర్నూలులో హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1 ఎస్ఈగా ఉన్న డి.రామ్‌గోపాల్ నియమితులయ్యారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న ఎస్.సుగుణాకరరావును ఏలూరులో పీఐపీ-ఆర్ఎంసీ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఈ ఏడాది అక్టోబరులో విజయనగరం రామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఎస్ఈగా ఉన్న సుగుణాకరరావు విశాఖకు బదిలీపై వచ్చి నార్తు కోస్టు సీఈగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారు. అయితే గత నెలలో నార్త్ కోస్ట్ సీఈగా రామ్‌గోపాల్‌కు, విజయవాడలో డిజైన్స్ సీఈగా సుగుణాకరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే పని సౌలభ్యం కోసం రామ్‌గోపాల్‌ను విశాఖకు, సుగుణాకరరావును ఏలూరుకు బదిలీ చేశారు. ఈయన విజయవాడలో డిజైన్స్ సీఈగా బాధ్యతలు నిర్వహిస్తారు.

సీఎం రాక రేపు

6న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'కు హాజరు

- అనంతరం వీఎంఆర్‌డీఏలో అధికారులతో సమీక్ష
- ఆ తరువాత పార్టీ కార్యాలయానికి...



విశాఖపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం రాత్రి విశాఖపట్నం వస్తున్నారు. ఆయన ఆరో తేదీన నోవాటెల్‌లో జరిగే 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. దీనిని గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్సఫర్మేషన్ ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.78 కోట్లతో అభివృద్ధి పనులు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- శృంగవరం- గన్నవరంమెట్ట మధ్య రూ.14 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం



శృంగవరం నుంచి గన్నవరం మెట్ట వరకు రూ.14 కోట్లతో చేపట్టనున్న రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఐదు నెలల్లోనే నర్సీపట్నం నియోజకర్గానికి రూ.78 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేయిస్తున్నామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చెప్పారు. మంగళవారం సాయంత్రం తుని-నర్సీపట్నం మార్గంలో నాతవరం మండలం శృంగవరం నుంచి గన్నవరం మెట్ట వరకు చేపట్టనున్న రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు మన్యపురట్ల జంక్షన్ వద్ద ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, రూ.14 కోట్ల న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టనున్న పనుల్లో భాగంగా పదిచోట్ల కల్వర్టులు, మూడుచోట్ల మైనర్ వంతెనలు నిర్మిస్తారని చెప్పారు. ఈ పనులు పూర్తయితే నర్సీపట్నం - తుని మధ్య రవాణా సదుపాయం మెరుగుపడుతుందని అన్నారు. మన్యపురట్ల ... మిగతా 8వ పేజీలో

అట్టహాసంగా కనకదుర్గమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కొక్కిరాపల్లి అగ్రహారంలోని స్వయంభూ కనకదుర్గమ్మ అమ్మవారి జాతర మంగళవారం అట్టహాసంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఏపీ రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, కూటమి నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నేతలు ప్రగడ, పప్పలను ఘనంగా సత్కరించారు. జాతరలో మహిళల కోలాటాలు, నేలవేషాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పలనాయుడు



నియామక పత్రాన్ని అందుకుంటున్న అప్పలనాయుడు

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పూడిమడకకు చెందిన మేరుగు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు అప్పలనాయుడుకు అఖిల భారత శరీర అవయవ దాత సంఘం చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి నియామక పత్రాన్ని అందజేశారు. అప్పలనాయుడు స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు. ఆయన ఎంతోమందిని ఒప్పించి అవయవదానం చేయించారు. దీంతో ఆయనకు ఈ పదవి వరించింది.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నైపుణ్య శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. స్కిల్ హబ్ సెంటర్‌గా ఎంపిక చేసిన తమ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. పదో తరగతి ఆపైన విద్యార్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయస్సుగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు పూర్తిచేసినవారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాల కోసం స్కిల్ హబ్ సెంటర్ కో-ఆర్డినేటర్ కె.నరేంద్ర సెల్ నం.96401 38565లో సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్, సీజనల్ వ్యాధులపై అవగాహన

ఎస్.రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బందికి సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా హెచ్ఐవీ సంక్రమించిన తల్లి నుంచి బిడ్డకు, కలుషిత సూదులు, సిరంజీలు వాడడం, సురక్షితం కాని లైంగిక సంపర్కంతో ఈ వ్యాధి సంక్రమించే అవకాశాలు ఉన్నాయన్నారు. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు, జ్వరాల వంటి వ్యాధుల విషయంలో అశ్రద్ధ చేయకూడదన్నారు. అనంతరం గ్రామంలో ఎయిడ్స్, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎం. రత్నసఖి, వై సూర్యకుమారి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దిబ్బపాలెం పంచాయతీ జోగన్నపాలెంలో వీరాంజనేయ స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దిబ్బపాలెం ఉపసర్పంచ్ రాజాన విజయ్, ఎంపీటీసీ సభ్యుడు నీరుకొండ నర్సింగరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లాలం రాజు, అడిగర్ల దేముడు, లాలం నగేష్, వెంకటరావు, కొండబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డి. పట్టా భూములు అన్యాక్రాంతం కాకూడదు

▸▸ రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయేషా



డి.పట్టా భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయేషా

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డి.పట్టా భూములు అన్యాక్రాంతం కాకూడదని అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి షేక్ ఆయేషా అన్నారు. మంగళవారం మండలంలో కాకరాపల్లిలో డి.పట్టా భూములను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలను ఆదుకోవడం కోసం ప్రభుత్వం డి.పట్టా భూములను పంపిణీ చేసిందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొంత మంది ఈ భూములను ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని చెప్పారు. ఆమె వెంట తహసీల్దార్ ఆదిఉమామహేశ్వరరావు ఉన్నారు.

ఆధునిక సాంకేతికతతో నేరాలు అదుపు

▸▸ గంజాయి, సారా నిరోధించడానికి పటిష్ఠ చర్యలు

▸▸ ఎస్పీ తుహిన్ సిన్హా



అచ్యుతాపురం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్పీ తుహిన్ సిన్హా

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక సాంకేతిక పరికరాలను వినియోగించి నేరాలను అదుపు కట్టడి చేస్తామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా నిరుపేదలు, వృద్ధులు, మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధానం ఇవ్వాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేయాలని, గంజాయి రవాణా, నాటుసారా తయారీని నిరోధించడానికి పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల గురించి ఆరా తీశారు. పెండింగ్ కేసుల పురోగతిని తెలుసుకొని త్వరగా పరిష్కరించడానికి తగు సూచనలు చేశారు. రాత్రిపూట నేరాలకు అడ్డుకట్టవేసేందుకు గస్తీని ముమ్మరం చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, చెడునడత కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని, జీవనోపాధికి ఎటువంటి పనులు చేస్తున్నారో ఆరా తీయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అచ్యుతాపురం జంక్షన్‌ను పరిశీలించి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సూచనలిచ్చారు. ఎస్పీ వెంట ట్రైనీ ఐపీఎస్ అధికారి మనీష్‌రెడ్డి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, స్థానిక సీఐ నమ్మి గణేశ్, ఎస్ఐలు జి.సుధాకర్. ఎం.వెంకటరావు వున్నారు.

తాండవ నదిలో చేప పిల్లలను పడితే చర్యలు

▸▸ జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్



పెంటకోటలో చేప పిల్లల చెరువును పరిశీలిస్తున్న ఎఫ్‌డీఓ ప్రసాద్ తదితరులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా తాండవ నదిలో చేప పిల్లలను పడితే చర్యలు తీసుకుంటామని జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలో పెంటకోట, రాజవరం ప్రాంతాల్లో పర్యటించిన ఆయన కొంతమంది వ్యక్తులు అక్రమంగా తాండవ నదిలో చేప పిల్లలను పట్టి చెరువుల్లో ఉంచడాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమావేశంలో తాండవ నదిలో చేప పిల్లలు పట్టమని తెలియజేసినప్పటికీ కొంతమంది మరలా ఎందుకు పడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా తాండవ నదిలో చేప పిల్లలను పట్టవద్దన్నారు. నదిలో చేప పిల్లలను పట్టకుండా చూడాలని గ్రామ మత్స్య సహాయకులను ఆదేశించారు. ఇక నుంచి నదిలో నిబంధనలకు విరుద్ధంగా చేప పిల్లలు పట్టినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పాయకరావుపేట పోలీసులకు తెలియజేస్తున్నట్టు డీఎఫ్ఓ తెలిపారు. ఆయన వెంట ఏడీ జాస్మిన్, ఎఫ్‌డీఓ రవివర్మ తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

▸▸ నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్



నామవరం జంక్షన్‌లో పరిశీలిస్తున్న డీఎస్పీ మోహన్, తదితరులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్.మోహన్ తెలిపారు. మంగళవారం పాయకరావుపేట సీఐ జి.అప్పన్న, ఎంవీఐ ఎస్‌వీఆర్.మూర్తి, ఆర్ అండ్ బీ ఏఈ జ్ఞానేశ్వరరావుతో కలిసి పట్టణంలో ప్రమాదాలు జరిగే తాండవ జంక్షన్, కనోసా స్కూల్, మండలంలో నామవరం జంక్షన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

వరాహా నది గట్లు, గ్రోయిన్‌లను పరిశీలించిన ఈఈ

ఎస్.రాయవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోముదేవుపల్లి, వమ్మవరం సమీపంలో కోతకు గురైన వరాహానది గట్లను మంగళవారం ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం, డీఈఈ జగదీశ్వరరావు పరిశీలించారు. అలాగే దెబ్బతిన్న ధర్మవరం అగ్రహారం, వమ్మవరం గ్రోయిన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ వమ్మవరం, సోముదేవుపల్లి వద్ద కోతకు గురైన వరాహానది గట్లుకు తాత్కాలిక పనులు చేపట్టాలని, దెబ్బతిన్న గ్రోయిన్ మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయాలని స్థానిక ఇరిగేషన్ ఏఈ భానును ఆదేశించారు.



వమ్మవరం వద్ద కోతకు గురైన వరాహానది గట్టును పరిశీలిస్తున్న ఈఈ బాలసూర్యం

ఆత్మస్థైర్యంతో దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

▸▸ ఏపీడీఆర్‌సీ చైర్మన్ ప్రగడ



అచ్యుతాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు



ఎలమంచిలి భవిత కేంద్రంలో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న జడ్జి స్వాతి భవానీ

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యంతో దివ్యాంగులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం భవనంలో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో చాలా మంది దివ్యాంగులు పట్టుదల, ఆత్మస్థైర్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. అంతకు ముందు మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పీఎస్‌టీ పట్నాయక్‌ని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీరుకొండ నర్సింగరావు, చొప్ప తాతారావు, పంచదార్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. స్వాతి భవానీ ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. భవిత కేంద్రంలోని దివ్యాంగులతో కాసేపు ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మీనాక్షి, ఏజీపీ ద్వారపురెడ్డి వెంకటరావు, ప్యానెల్ న్యాయవాదులు బి.హరిశంకరావు, పీవీ రమణ పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

మండలంలోని గొడిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ప్రపంచ దివ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లో వున్న వైకల్యాన్ని గుర్తించి ,వారికి సహిత విద్యా బోధన చేయడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి ఎంఈవోలు బహుమతులు అందజేశారు. దివ్యాంగ విద్యార్థులకు విజయ్‌కుమార్ అనే దాత స్వెట్టర్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక బోధనా ఉపాధ్యాయురాలు షేక్ యాస్మిన్, ప్రధానోపాధ్యాయుడు జి. అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని గోకులపాడు భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోటూరు శేషారావు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లల అభివృద్ధి, ఆరోగ్యం వంటి విషయాలను కుటుంబంతోపాటు సమాజం కూడా నైతిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. అనంతరం భవిత కేంద్రంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ చాటిన దివ్యాంగుల విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు రజినీకాంత్ పట్నాయక్, వినీల, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, మూర్తి పాల్గొన్నారు.

కోటవురట్లలో..

సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులకు మనోధైర్యం కల్పించాలని ఎంఈవో రామారావు అన్నారు. మంగళవారం స్థానిక భవిత భవనంలో ప్రపంచ దివ్యాంగులు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 జోషి, హైస్కూల్ హెచ్ఎం జి. లక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్ బాలముకేష్, శిరీష్, రమణి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

స్థానిక పీహెచ్.వాడ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ-2 రమేష్, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గొర్రెల రాజబాబు, టీడీపీ నాయకులు మజ్జూరి నారాయణరావు మాట్లాడుతూ అవయవ లోపాన్ని మరచి స్వయంశక్తిపై గర్వంగా జీవించేందుకు ప్రయత్నించాలన్నారు. అనంతరం శ్రీసత్యసాయి ట్రస్టు అందజేసిన పుస్తకాలు, పెన్నులు విద్యార్థులకు పంపిణీ చేశారు. అదేవిధంగా వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాల హెచ్ఎం అనంతలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, శ్రీనివాస్, ప్రత్యేక ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, క్రాంతికుమారి, దుర్గాదేవి, ఫిజియోథెరపిస్టు అనూష, టీడీపీ నేతలు గొల్లపల్లి నాగు, పడాల కోటి పాల్గొన్నారు.

మునగపాకలో..

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని స్థానిక ఎంపీపీ మళ్ల జయమ్మ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగులకు కృష్ణ చైతన్య దంపతులు స్వెట్టర్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బోడకుర్తి గణేష్, ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై దర్యాప్తు మొదలు

▸▸ ఏపీవో శివ, ఎంపీడీవో ఉషారాణి

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేయకుండా వేతనం పొందుతున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఏపీవో శివ, ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గత నెల 25వ తేదీన జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పల్లపుఆనందపురం గ్రామానికి చెందిన మోహన్‌రావు ఉపాధి పథకం పనల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో, ఏపీవో తదితరులు పి.ఆనందపురం వెళ్లి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు, లబ్ధిదారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గందరగోళ పరిస్థితులు ఏర్పడడంతో వారిని అధికారులు సముదాయించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు : తహసీల్దార్

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్థానిక తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఇటీవల సారా, మద్యం విక్రయాలు చేసి పట్టుబడిన పలు గ్రామాలకు చెందిన 18 మందిని ఎక్సైజ్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. నిందితులు సమర్పించిన హామీ పత్రాలను పరిశీలించారు. మరోసారి పట్టుబడితే జైలు శిక్ష, జరిమానా తప్పదని హెచ్చరించారు.

స్వర్ణ పంచాయతీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలి

▸▸ ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్

పాయకరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్వర్ణ పంచాయతీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని ఈవోపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం మండలంలో స్వర్ణ పంచాయతీ సర్వేలో వెనుకబడిన పాయకరావుపేటలో ఎస్‌జీపీ సర్వే వివరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎస్‌జీపీ సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని, అసెస్మెంట్స్ వంద శాతం అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అంతకుముందు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో గత వారంలో గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వారంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఆర్, హౌసింగ్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

16 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

మునగపాక, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చూచుకొండ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తి నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు చెప్పారు. ఇతను కశింకోట మండలం సోమవారం గ్రామానికి చెందిన పితాని శివగా నిర్ధారించుకుని కేసు నమోదు చేశామన్నారు.

చలో అమరావతి విజయవంతం చేయాలి

▸▸ డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణస్వరూప్



మాట్లాడుతున్న డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణస్వరూప్

పాయకరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్‌కు వ్యతిరేకంగా మాలమహానాడు, దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహించనున్న చలో అమరావతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ జరిగితే ఏపీలో మెజార్టీ మాలలు భవిష్యత్తు నాశనం అవుతుందని, క్రీమీలేయర్‌తో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై దేశ వ్యాప్తంగా దళిత జాతి ఆందోళన చేస్తున్నందున, దీనిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మలమహానాడు జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్.రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీలా గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ఎంపీ. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట బీమాతో రైతులకు మేలు : ఏవో

ఎస్.రాయవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంటల బీమా చేయించుకోవడం వలన పంట నష్టం జరిగితే రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాధికారిణి సౌజన్య అన్నారు. మండలంలోని గెడ్డపాలెంలో మంగళవారం ఏవో సౌజన్య రబీ సీజన్‌లో పంటల బీమాపై రైతులు, కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతింటే ఆ పంటలకు నష్ట పరిహారం అందుతుందన్నారు. బీమా చేయించుకోవడానికి ఈనెల 15 ఆఖరి తేదీ అని, రైతులు రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సౌజన్య కోరారు.

వరి తెగుళ్ల నివారణకు సస్యరక్షణ

రాంబిల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):వరి పంటను ఆశించిన తెగుళ్ల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. వి.చంద్రశేఖర్ రైతులకు సూచించారు. మండలంలోని దిమిలి, పంచదార్ల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత ఆయన రైతులు, వ్యవసాయాధికారులతో కలిసి ఆయా గ్రామాల్లో వరి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ క్షేత్ర పరిశీలనలో వరి పంటను మానిపండు తెగులు ఆశించినట్టు గుర్తించినట్టు చెప్పారు. ఈ తెగులు నివారణకు ప్రొఫికొనజోల్ 1 మిల్లీలీటరు మందును లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 మిల్లీలీటర్లు మందును పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత, వీఏఏలు మేఘన, సరోజిని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాస్, కనకరత్నం, హైమ, పలువురు రైతులు పాల్గొన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్‌వోల వినతి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోలు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బయోమెట్రిక్ విధానంతోపాటు పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ మంగళవారం తహసీల్దారు వరహాలకు వినతిపత్రం అందజేసినట్టు గ్రామ రెవెన్యూ అధికారుల(వీఆర్‌వోలు) సంఘం మండల అధ్యక్షుడు పి. మారేశ్వరరావు తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకూ సచివాలయంలో ఉండి రెండు పూటలా బయోమెట్రిక్ హాజరు వేయాలనే నిబంధనతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. చాలా సచివాలయాలు మండల కార్యాలయానికి పది కిలోమీటర్లు దూరంలో ఉన్నాయని, మీటింగ్‌లు జూమ్ ద్వారా పెట్టగలని, ధ్రువీకరణ పత్రాలు ఆన్‌లైన్‌లో ఫార్వర్డ్ చేయగలమని, మ్యూటేషన్లు, తదితర పనులన్నీ వారానికి ఒకరోజు కార్యాలయానికి వచ్చి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఘంటసాల కళామందిరంలో బుధవారం ఉదయం పద్మశ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు 102వ జయంత్యుత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. చైర్‌పర్సన్ రమాకుమారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలన జరుగుతుందన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం సంగీత విభావరి అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

తాగునీటి సంపు వద్ద పైపులైన్ పనులు

ఎలమంచిలి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని యర్రవరం తాగునీటి సంపు వద్ద పైపులైన్ పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి. మంగళవారం ఈ పైపులైన్ పనులను కమిషనర్ ప్రసాదరాజు పర్యవేక్షించారు. ఇటీవల పైపులైన్ పాడవడంతో నూతన పైపులైన్ పనులు చేపట్టారు. ఏఈ గణపతి సుబ్బారావు పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయి. తాగునీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్టు ఏఈ సుబ్బారావు తెలిపారు.

సివిక్స్ గెస్టు అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సివిక్స్ గెస్టు అధ్యాపకుడి పోస్టు భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ యు.సింహచలం తెలిపారు. ఎంఏ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

సుంకపూర్‌లో పొలం పిలుస్తోంది

కోటవురట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్‌లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారిణి సరోజిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీలో క్రాప్ ఇన్సూరెన్స్ గురించి రైతులకు వివరించారు. వర్షాలకు కోసిన వరి పనలు తడిసినా, నేలకు ఒరిగిన 5శాతం కళ్లు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్‌ను ఈనెల 15వ తేదీలోగా చేయించుకోవాలని ఆమె కోరారు.



వేరుశనగ విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

వాణిజ్య పంటలపై ఆసక్తి పెంచుకోండి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందించే రాయితీలను ప్రతీ రైతు వినియోగించుకొని, వాణిజ్య పంటలపై ఆసక్తి చూపించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని వారాడలో రైతులకు వేరుశనగ, మినుము, పెసర విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి, చెరకు పంటలతో పాటు ఉద్యాన పంటలపై రైతులు దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నందున ప్రతి రైతు సేంద్రియ విధానాన్ని అమలు చేయాలన్నారు. వాణిజ్య పంటల సాగు ద్వారా అధిక రాబడి, ఆదాయం పొందవచ్చునన్నారు. కూరగాయలు, పండ్లు నిల్వ చేసుకునేందుకు వీలుగా మండలంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రొంగలి మహేష్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు లెక్కల అవతారం, మాజీ ఎంపీపీ సబ్బవరపు పుష్పరామునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గోపి, వ్యవసాయశాఖ ఏడీ రవీంద్రర్, ఏఓ సోమశేఖర్, ఉద్యానవనశాఖ అధికారి కిరణ్మయి, సేంద్రియ వ్యవసాయాధికారి నాగమణి, కూటమి నాయకులు దాడి ఎరుకునాయుడు, జి. వెంకట్రావు, డోకల నరసింహమూర్తి, జూరెడ్డి రాము, బాలిబోయిన సంతోష్, కొటాన ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో మహిళా పోలీసులు భాగం కావాలి



పోస్టర్ ప్రదర్శిస్తున్న డీఎస్పీలు శ్రీనివాసరావు, మోహన్, పోలీసులు

నర్సీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపు చేయడంలో సచివాలయ మహిళా పోలీసులు భాగం కావాలని అనకాపల్లి దిశ డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాలు, అత్యాచారాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికతో శారీరక సంబంధం పెట్టుకుంటే 20 సంవత్సరాలకు తగ్గకుండా జైలు శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల నష్టాలు, ఫోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ గంజాయి వల్ల మానసిక వైకల్యానికి గురవుతారన్నారు. నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నతాధికారులకు ఇవ్వాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో కలిసి సంకల్ప్ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్‌వో



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీసీహెచ్‌వో శ్రీనివాసరావు

మాడుగుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీహెచ్‌సీని జిల్లా మెడికల్ హెల్త్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. మంగళవారం సాయంత్రం 6గంటల సమయంలో మాడుగుల ఆస్పత్రిని సందర్శించిన ఆయన నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది ఏ విధంగా పనిచేస్తున్నారన్న దానిపై ఆరా తీశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ చంద్రశేఖర్, వైద్యుడు సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.


కోళ్ల వ్యర్థాలను పట్టుకున్న సీపీఎం నేత

దేవరాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తారువ, ఎన్.గజపతినగరంల్లో చేపల చెరువుల కోసం తరలిస్తున్న కోడి వ్యర్థాలను సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న మంగళవారం పట్టుకొని రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించారు. చేపల చెరువులో పశు మాంసం, వ్యర్థాలను వేస్తున్నారని ఫిర్యాదులు చేసినా యజమానులు బరితెగిస్తున్నారని ఆరోపించారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గుర్తించాలి

చీడికాడ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చిన్న, మధ్యతరహా పరిశ్రమలను గుర్తించాలని ఎంపీడీవో హేమసుందరరావు ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వేపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళ పోలీసులకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని పరిశ్రమలను గుర్తించేందుకు సర్వే చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ శిక్షణలో పరిశ్రమల శాఖ ఏడీ యోగినాధం, పరిశ్రమల ప్రమోషన్ ఆఫీసర్ గాయత్రి, ఈవోపీఆర్‌డీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం తీసుకున్నవారికి ప్రమాద బీమా



సభ్యత్వ నమోదును చూపుతున్న టీడీపీ కార్యకర్తలు

చీడికాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి ప్రమాద బీమా వర్తిస్తుందని క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డి రాము అన్నారు. పెదగోగాడలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీమాతోపాటు దహన సంస్కరణ ఖర్చులకు పార్టీ నుంచి రూ.10వేలు వరకూ అందుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రెడ్డి జయమ్మ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

తడిచిన వరి పనలపై ఉప్పు నీటిని చల్లాలి

మాడుగుల రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కోత కోసి తడిచిన వరి పనలపై 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు రైతులకు సూచించారు. మంగళవారం సత్యవరం, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించారు. వర్షాలకు తడిచిన వరి పనలు ఆరబెట్టాలని, ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేయడం వల్ల ధాన్యం మొలకెత్తకుండా ధాన్యం రంగు మారకుండా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చారుమతిదేవి, లక్ష్మి, రైతులు జెర్రిపోతులు సూర్యనారాయణ, గట్రెడ్డి శ్రీను పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యం

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు





రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పక్కన కలెక్టర్ విజయ్‌కృష్ణన్... మాట్లాడుతున్న అయ్యన్న

గొలుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని పప్పుశెట్టిపాలెం గ్రామ పంచాయతీలో పీఎన్‌డీ.పాలెం, పెసరాడ, అప్పన్నపాలెం, కంఠారం, అడ్డల్లోవ మీదుగా రూ.4.6 కోట్లతో తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో స్పీకర్ అయ్యన్న మాట్లాడుతూ ప్రతీ పల్లెకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో రూ.80 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదే గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం, రెండో ఏడాదిలో పంట కాలువలు, సిమెంట్ లైనింగ్, చెక్ డ్యామ్‌ల మరమ్మతులు, మూడో ఏడాది శ్మశానవాటికల అభివృద్ధి, నాలుగో ఏడాది గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు పనులు చేపట్టేందుకుగాను ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. నెలలో 1వ తేదీ సెలవు దినమైతే ముందు రోజు ఉదయం ఏడు గంటలలోపే శతశాతం పింఛన్లు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. భర్త పింఛను పొందుతూ మృతి చెందితే, తక్షణమే భార్య పేరుపై పింఛను మంజూరు చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. వచ్చే నెల నుంచి అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డులు అందించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, ఆర్డీవో వీవీ.రమణ, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో మేరీరోజీ, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ వీరసూర్యచంద్ర, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, సర్పంచ్ విజలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పలనాయుడు, నాయకులు కొల్లి సత్తిబాబు, సుర్ల బాబ్జి, కొల్లి రాంబాబు, కొల్లాన కొండలరావు, బెల్లపు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రతిభా పరీక్షలో గాయత్రికి ద్వితీయ స్థానం



రావికమతం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తెలుగు ప్రతిభా పోటీ పరీక్షలో మరుపాక ఆదర్శ పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న కె.గాయత్రి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. హైదరాబాద్‌కు చెందిన మన సంస్కృతి యాజమాన్యం నిర్వహించిన ఈ పోటీ పరీక్షల్లో 101 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో గాయత్రి ద్వితీయ స్థానం దక్కించుకున్నట్టు మోడల్ స్కూల్ హెచ్‌ఎం సునీల్‌కుమార్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన ఆమెకు హైదరాబాద్‌లో నగదు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రం అందజేస్తారన్నారు.

రైతులు పశుగ్రాసం పెంచుకోవాలి

కె.కోటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పశుగ్రాసం పెంచుకొనేందుకు ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఈ. దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో మంగళవారం దేవరాపల్లి, కె.కోటపాడు మండలాల పశువైద్య సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అఖిల భారత పశు గణన వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఇప్పటికి 25 శాతం గణన పూర్తయిందన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులో భాగంగా రైతులకు రుణ సదుపాయం కల్పించనున్నట్టు చెప్పారు. ఈ రుణం తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించినట్టయితే వడ్డీ మాఫీ చేస్తారన్నారు. కార్యక్రమంలో కె. కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన 24 మంది పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

గాదిగుమ్మిలో పిక్నిక్ సందడి

కృష్ణాదేవిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గాదిగుమ్మి జలపాతం వద్ద మంగళవారం పిక్నిక్ సందడి నెలకొంది. ఏఎల్‌పురం, కృష్ణాదేవిపేట తదితర పరిసర ప్రాంతాల వ్యాపారులు, ప్రజలు పాల్గొని ఆటపాటలతో సరదాగా గడిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ వై.తారకేశ్వరరావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. షాపుల యాజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని దొంగతనాలు నిర్మూలనకు సహకరించాలని కోరారు. వర్తక సంఘం అధ్యక్షుడు నానిబాబు, ఉపాధ్యక్షుడు ఎస్.జోగునాథం, రిటైర్డ్ హెచ్‌ఎం అచ్చిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గణేశ్‌ను పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం బూడి



గణేశ్‌ను పరామర్శిస్తున్న బూడి, వైసీపీ నాయకులు

నర్సీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హిప్ రిప్లేస్‌మెంట్ (తుంటి ఎముక) ఆపరేషన్ చేయించుకున్న మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు మంగళవారం పరామర్శించారు. కొవిడ్ నివారణకు అతిగా మందులు (స్టెరాయిడ్స్) వాడడం వల్ల మాజీ ఎమ్మెల్యే గణేశ్ రెండు కాళ్లకు తుంటి భాగాలు దెబ్బతిన్నాయి. వారం రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. విశ్రాంతి తీసుకుంటున్న గణేశ్‌ను బూడి ముత్యాలనాయుడు, వైసీపీ నాయకులు రుత్తల ఎర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించాలి



దివ్యాంగులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ఎంఈవో మూర్తి సూచించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడకూడదని, వారిని ఆదరించాలని సూచించారు. అలాగే దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

విద్యా విధానంలో మార్పులకు పరీక్షలు దోహదం

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యా విధానంలో మార్పులకు పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఈవో-2 కామిరెడ్డి వరహాలబాబు చెప్పారు. మండల కేంద్రంలో మంగళవారం సీఆర్‌పీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యా సంబంధ విషయాలపై చర్చించారు. ఈ పరీక్షలు 3, 6, 9 తరగతులు విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఉంటాయని చెప్పారు. ముందుగా మర్రిపాలెం కేజీబీవీ, ఎంబీపట్నం హైస్కూల్, మర్రిపాలెం పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

డి.పట్టా భూముల గుర్తింపు ప్రక్రియ వేగవంతం చేయండి

▸▸ తహసీల్దార్ ఎల్.రామారావు

మాకవరపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డి.పట్టా భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ లోకవరపు రామారావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో లబ్ధిదారులకు మంజూరు చేసి అసైన్డ్ రికార్డుల ప్రకారం డి.పట్టా భూముల్లో రైతు ఉండాలని, లేనిపక్షంలో వారసుడు ఉండాలని స్పష్టం చేశారు. డి.పట్టా భూములను ఇతురులు కొనుగోలు చేస్తే స్వాధీనం చేసుకోవాలన్నారు. ప్రతీ వీఆర్‌వో తప్పనిసరిగా భూమి వద్దకు వెళ్లి గుర్తించాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా డి.పట్టా భూములను గుర్తిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆర్ఐ జట్టి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

గొలుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాలు సీజన్ కావడంతో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

గొలుగొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో బీజేపీ నాయకుడు గౌరినాయుడు దివ్యాంగులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని చెప్పారు. ఇందులో భాగంగా మండలాల్లో భవితా కేంద్రాల ద్వారా వారిని తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈవోలు సత్యనారాయణ, మూర్తి, బీజేపీ నాయకులు ఎర్రినాయుడు, ముక్కల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని రిటైర్డు ఎంఈవో అమృతకుమార్ కోరారు. స్థానిక భవిత కేంద్రం దివ్యాంగులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పి.కొండబాబు, ఎంఈవో-2 కె.వరహాలబాబు ఉపాధ్యాయులు జి.లక్ష్మదేవి, రమాదేవి పాల్గొన్నారు.

టీడీపీ నేత నాయుడుబాబుకు ఘన నివాళి

హాజరైన స్పీకర్ అయ్యన్న, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు



నాయుడుబాబు విగ్రహం వద్ద పిల్లలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న స్పీకర్ అయ్యన్న, ఎమ్మెల్యేలు బండారు. కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు దివంగత నాగిరెడ్డి వెంకట రమణ (అడ్డూరు నాయుడుబాబు) వర్ధంతిని మంగళవారం మండలంలోని అడ్డూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు, చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు కేఎస్ఎన్ఎస్ రాజు, బండారు సత్యనారాయణ హాజరై, నాయుడుబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రం విద్యార్థులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు యూనిఫాం పంపిణీ చేశారు. నాయుడుబాబు తెలుగుదేశం పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ గంగాధర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కనిశెట్టి మత్స్యరాజు, స్థానిక టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, పెదబాబు, సర్పంచ్ అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు రమేష్, నాయుడుబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు సంక్షేమ పథకాల అమలు : ఎంపీడీవో



వికలాంగుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీవో అంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ-1 కె. సత్యనారాయణ

చోడవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు దివ్యాంగులకు అందేలా చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో పీఎస్ అంజనేయులు తెలిపారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు ప్రభుత్వం అనేక రాయితీలు అమలు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం తరపున సంఘం నాయకులు దుగ్గిరాల రవికుమార్, శరగడం నాగభూషణం తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా 41 మంది దివ్యాంగులకు ఆర్టీసీ అధికారులు బస్‌పాస్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీఐ పి. అప్పలరాజు, ఆర్క్ ప్రసాద్, గనిరెడ్డి, ఉగ్గిన నాగబాబు, రమేష్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో..

స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మానసిక, శారీరక లోపాలు గల చిన్నారులపై శ్రద్ధ తీసుకుంటే ఎందులోనూ తీసుపోరన్నారు. అనంతరం చౌడువాడకు చెందిన పెంటకోట గణపతిరావు దంపతుల ఆర్థిక సహకారంతో దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 డీవీడీ ప్రసాద్, హెచ్‌ఎంలు పద్మావతి, ఆర్. రమేష్, ఏ.కుమార్, భవిత కేంద్రం నిర్వాహకులు సీహెచ్. కన్నమ్మ, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో..

మండలంలోని మేడివాడ జడ్పీ హైస్కూల్ ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు దివ్యాంగులకు అందిస్తున్న సేవలకు జిల్లా స్థాయిలో ఉత్తమ సేవకుడిగా అవార్డు లభించింది. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అనకాపల్లి గవరపాలెం రైతు భారతి కల్యాణ మండపంలో మహాలక్ష్మినాయుడుకు జిల్లా జాయింట్ కలక్టర్ జాహ్నవి,రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర,అనకాపల్లి ఆర్డీవో ఆయేషా, జిల్లా వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ జగదీష్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించి,ఘనంగా సత్కరించారు.



జాయింట్ కలెక్టర్ జాహ్నవి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న మహాలక్ష్మినాయుడు

కేశవస్వామి, రాజలింగేశ్వరస్వామి ఆలయాల హుండీ ఆదాయం రూ.37 వేలు

రావికమతం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తకోట కేశవ స్వామి, రాజలింగేశ్వరస్వామి ఆలయాల హుండీల ఆదాయాన్ని మంగళవారం దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ చైర్మన్‌ల ఆధ్వర్యంలో లెక్కించారు. కార్తీక మాసం సందర్భంగా హుండీలలో భక్తుల నుంచి కానుల రూపంలో రూ.37వేల 285లు వచ్చినట్టు ఎండోమెంట్ ఈవో కిరణ్మయి తెలిపారు. కేశవ స్వామి ఆలయానికి రూ.13,964, రాజలింగేశ్వర స్వామి ఆలయానికి రూ.23,321 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్‌లు గుమ్ముడు గోవింద్, కోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విశాఖ డెయిరీ అవినీతిపై కాలయాపన చేయవద్దు

▸▸ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి



విలేకరులతో మాట్లాడుతున్న రెడ్డిపల్లి అప్పలరాజు

చోడవరం, డిసెం బరు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీ అవినీతిపై ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయవద్దని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు కోరారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, డెయిరీలో పాడిరైతుల కష్టాన్ని దోచుకుంటున్నట్టు స్పష్టంగా కనపడుతున్నా, ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. డెయిరీ వ్యవహారంలో ప్రతిపక్ష వైసీపీ వ్యవహరిస్తున్న తీరు కూడా సరిగ్గాలేదన్నారు. రైతులు చేస్తున్న ఆందోళనను పోలీసులతో ఆపడం సరైన చర్య కాదని, డెయిరీ అవినీతిపై ప్రభుత్వం స్పందించి అవినీతికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అప్పలరాజు డిమాండ్ చేశారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు

కె.కోటపాడు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సేవ చేయడమే సత్యసాయి సంస్థల ధ్యేయమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పాఠశాల వ్యాసరచన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, మెరిట్ సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 సత్యనారాయణ, సత్యసాయి సేవా సంస్థల మండల ఇన్‌చార్జి కన్నూరు అప్పలనాయుడు, కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు, లంకవానిపాలెం కన్వీనర్ కృష్ణ, హైస్కూల్ హెచ్‌ఎం పద్మావతి, సంఘ మిత్ర సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సంత తోటలో సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే బండారుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

దేవరాపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారు సంత తోటలో కొళాయి, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతూ మంగళవారం టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్ల ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి వినతిపత్రం ఇచ్చారు. జల జీవన్ మిషన్ భాగంగా ఇంటింట కొళాయిలు వేయాలని, రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ కార్యకర్తలు సత్తిబాబు, శంకరు, సన్యాసిరావు, సీహెచ్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ శిక్షణ పొందిన టీచర్లకు సర్టిఫికెట్లు



నాగజ్యోతికి సర్టిఫికెట్ ఇస్తున్న డీఈఓ

రోలుగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కోర్సు పూర్తి చేసుకున్న రోలుగుంట జడ్పీ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుని నాగజ్యోతి, పీఈటీ గోవిందలకు సర్టిఫికెట్లను డీఈవో అప్పారావునాయుడు మంగళవారం అందజేశారు. వీరు ఏడు రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ పొందారు. పాఠశాలలో విద్యార్థులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రహసనంగా మారిన పాలిథిన్ నిషేధం

- కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- పెదబయలు సంతలో యథేచ్ఛగా కవర్ల వినియోగం
- వ్యాపారులపై చర్యలు శూన్యం

పెదబయలు,డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ప్లాస్టిక్, పాలిథిన్ కవర్లను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే, మండలంలో కొంతమంది వ్యాపారులు ఈ ఆదేశాలను బేఖాతరు చేస్తూ వీటి విక్రయాలు సాగిస్తున్నారు. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిషేధించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో మండలకేంద్రంలో గత నవంబరు నెల 25వ తేదీన సోమవారం సంతలో మండలస్థాయి అధికారులు ప్లాస్టిక్‌నుపూర్తి స్థాయిలో నిషేధిస్తున్నామని జోరుగా ప్రచారం సాగించారు. వర్తకులతో సమావేశమై ఈమేరకు ఆదేశాలు జారీ చేశారు. అయితే,



ప్లాస్టిక్ కవర్లలో కూరగాయలు విక్రయిస్తున్న వర్తకులు



ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు

మండల కేంద్రంలోని దుకాణాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేశారు. కానీ, 2వతేదీన సోమవారం జరిగిన వారపు సంతలో మాత్రంలో బయట నుంచి వచ్చిన వర్తకులు అధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా విచ్చలవిడిగా ఎక్కడబడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లను వినియోగించారు. కూరగాయలు, మాంసపు దుకాణాలు, దుస్తుల వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వాడుతూ కనిపించారు. మరి ఇంతగా నిషేధం పాటించకున్నా అధికారులు మిన్నకుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్ వినియోగించినా, విక్రయాలు చేపట్టినా జరిమానా విధిస్తామని అధికారుల హెచ్చరికలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. స్థానిక వారపు సంతలో అధికారుల కళ్ల ముందే పాలిథిన్ వాడకం కనిపిస్తున్నా కనీసం పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాస్టిక్ వినియోగాన్ని అడ్డుకట్ట వేయాలని పర్యవరణ ప్రేమికులు కోరుతున్నారు.

స్వచ్ఛతా హీ సేవా



ఆలయ ఆవరణలో చెత్త తొలగిస్తున్నసీఆర్‌పీఎఫ్ జీ 42 బెటాలియన్ పోలీసులు

సీలేరు, డిసెంబరు 3, (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరులో మంగళవారం సీఆర్‌పీఎఫ్‌జీ 42 బెటాలియన్ పోలీసులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ వికాష్ పాండియన్ ఆధ్వర్యంలో స్థానిక మారెమ్మ , అయ్యప్పస్వామి ఆలయాల వద్ద స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆలయాల పరిసరాల్లో చెత్త,ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మా నవాళికి నష్టాన్ని కల్గించే ప్లాస్టిక్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ స్వ చ్ఛందంగా నిషేధించాలన్నారు. ప్రకృతిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్‌ఐ రవీంద్ర పాల్గొన్నారు.

పెసా చట్టానికి వ్యతిరేకంగా గ్రామసభ నిర్వహిస్తే కోర్టులో కేసు

▸ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నేత రాజబాబు



కొయ్యూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆడాకుల గ్రామంలో పెసా చట్టానికి వ్యతిరేకంగా గ్రామ సభ నిర్వహిస్తే కోర్టులో కేసు వేస్తామని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు హెచ్చరించారు. మంగళవారం రాజబాబు ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. పీసా చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనులతో గ్రామస సభ పెడతారని, గిరిజనేతరులతో కాదని రాజబాబు పేర్కొన్నారు. ఆడాకులు గ్రామంలో 1950, 1970 సంవత్సరాలకుముందు నుంచే భూములుసాగు చేసుకుంటున్నామంటున్నారన్నారు. అయితే, కలెక్టరుకు వినతి ఇవ్వగా ఆయన విచారణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారన్నారు. ఈ విచారణలో వారికున్న సాగు హక్కు పత్రాలు చూపుకోవాలన్నారు. గతంలో శివశంకర్ సబ్ కలెక్టరుగా ఉన్నప్పుడు కొంతమంది నాయకులు, ప్రజా ప్రతినిదులు గ్రామ సభ తీర్మానం చేశారని, అది ఇప్పుడు ఎందుకు చెల్లలేదని రాజబాబు ప్రశ్నించారు. 1950 జనవరి 26న ఆమోదించిన రాజ్యాంగంలో 5, 6 షెడ్యూల్ప్ ఆమోదించారన్నారు. వీటిలో గిరిజనేతరుల విషయం ప్రస్తావన లేదన్నారు. అందువల్ల 5వ షెడ్యూల్డ్ ఏరియా అయినందున గిరిజనేతరుల విషయం ప్రస్తావించకూడదన్నారు. పీసా చట్టం ప్రకారం గ్రామసభ గిరిజనులకు మాత్రమే వర్తిస్తుందని, గిరిజనేతరులకు కాదన్నారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా ఈ నెల 19న ఆడాకులలో గ్రామసభ నిర్వహిస్తామనడం చట్టం ఉల్లంఘనేనన్నారు. ఇది జరిగితే కోర్టును ఆశ్రయియిస్తామని రాజబాబు హెచ్చరించారు.

కలెక్టర్‌కు మహిళా సమాఖ్య సత్కారం



కలెక్టర్ దినేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న గిరిజన ప్రతినిధులు

పాడేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):జిల్లా గిరిజన మహిళా సమాఖ్య ప్రతినిధులు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను మంగళవారం సత్కరించారు. సామాజిక పింఛన్ల పంపిణీలో రాష్ట్ర స్థాయిలో వరుసగా నాలుగు మార్లు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం లభించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఈ సన్మానం చేశారు. సామాజిక పెన్షన్ల పంపిణీ ప్రక్రియతోపాటు వెలుగు ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి కలెక్టర్ అందిస్తున్న సహకారం, ప్రోత్సాహం మరువలేనిదని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, డీపీఎం వీవీఎస్ ప్రసాద్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధులు దేవీ, భవానీ, జయకుమారి పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి: ఎంపీడీవో



సూచనలు చేస్తున్న ఎంపీడీవో కుమార్

అనంతగిరి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్యవివాహాలపై అడ్డుకట్టవేయాలని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం సీడీపీవో సంతోషికుమారితో కలిసి సచివాలయం మహిళా పోలీసులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. చదువుకునే వయస్సులో పెళ్లిపేరుతో చిన్నారుల జీవితాలను నాశనం చేస్తున్నారని, దీనిపై గ్రామస్థాయి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్యవివాహాలు చేస్తే కేసులు నమోదులు చేయాలని ఆదేశించారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

హుకుంపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని స్థానిక ఎంఈఓలు చెల్లయ్య, ఈశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత ఉన్నత పాఠశాలలో వి అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమతోటి దివ్యాంగు చిన్నారులను చిన్నచూపు చూడడం తగదని విద్యార్థులకు సూచించారు. అవసరమైతే, వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మణరావు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా పంటకు బీమా

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాజ్‌మా పంటకు ప్రభుత్వం కల్పిస్తున్న ఫసల్ బీమా సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పెద బడర గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2024 రబీ కాలానికి రాజ్‌మా పంటకు రైతులు ఎకరానికి రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు. గడువు ఈనెల 15తో ముగుస్తుందన్నారు.ఈకార్యక్రమంలోకూటమి నాయకులు గెమ్మెలి రమణ, వరహాలు, శ్రీను పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై చైతన్యం కావాలి: సీఐ



మాట్లాడుతున్న సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సైబర్ నేరాలపై చైతన్యవంతులు కావాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వర ప్రసాద్ అన్నారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలపై స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కురాదన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్, లోన్ యాప్స్‌కి పూర్తిగా దూరంగా ఉండాలన్నారు. ప్రతి విద్యార్థిని మంచి స్పర్శ, చెడు స్పర్శపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సన్నిహితులైనా ఇబ్బందికరంగా వ్యవహరిస్తే వెంటనే అప్రమత్తంకావాలన్నారు. అపరిచిత వ్యక్తులతో స్నేహం సరికాదన్నారు.. పోక్సో బాల్యవివాహాల నిరోధక చట్టం, విద్యాహక్కు, స్వేచ్ఛగా జీవించే హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ అప్పలసూరి, ప్రిన్సిపాల్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ డోలీ మోత

▸ అతి కష్టంపై పీహెచ్‌సీకి గర్భిణిని తరలింపు



గర్భిణీని డోలీలో మోసుకువస్తున్న కుటుంబ సభ్యులు

కొయ్యూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు డోలి మోత కష్టాలు తీరడంలేదు. గిరిజన గ్రామాలకు కనీస రహదారి సదుపాయం లేక ఆదివాసీలు రోగులు, గర్భిణులను డోలిపై ఆస్పత్రులకు తరలించాల్సివస్తోంది. మంగళవారం మండలంలోని డౌనూరు పంచాయతీ ఉసిరికపాడు గ్రామం నుంచి వంతల లక్ష్మి అనే గర్భిణీని డోలి సహాయంతో కుటుంబ సభ్యులు పీహెచ్‌సీకి తరలించారు. లక్ష్మికి ఉదయం పురిటినొప్పులు ప్రారంభం కావడంతో గ్రామం నుంచి ఐదు కిలోమీటర్లు డోలీపై తీసుకువచ్చి అక్కడ నుంచి అంబులెన్స్‌లో డౌనూరు పీహెచ్‌సీకి తరలించారు. గ్రామానికి రహదారి సదుపాయంలేక ఈ దుస్థితి నెలకొంది. గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి రూ.1.63 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. కాంట్రాక్టర్ అసంపూర్తిగా పనులు నిలిపివేసినట్టు గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో ఆదివాసీలకు రవాణా కష్టాలు తప్పడంలేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

బూత్ కమిటీల నియామకం వేగవంతం



బూత్ కమిటీ అధ్యక్షురాలు సింహాచలమ్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జి.మాడుగుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ శక్తి కేంద్ర పరిధిలో బూత్ కమిటీల నియామకం వేగవంతం చేయాలని ఆ పార్టీ పాడేరు నియోజక వర్గ కన్వీనర్, ఏపీ ట్రైకర్ బోర్డు మెంబర్ కూడ కృష్ణారావు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం మండల ఇన్‌చార్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి సల్ల రామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంత వరకు నమోదైన పార్టీ సభ్యత్వాలను పరిశీలించారు. బూత్ స్థాయిలో అధ్యక్షులను ఎంపిక చేసుకోవాలని కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం బందవీధి బూత్ కమిటీ అధ్యక్షురాలిగా ఎన్నికైన పలాసి సింహాచలమ్మను సన్మానించారు. ఈకార్యక్రమంలో కాఫీ బోర్డు మెంబర్, బీజేపీ గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమమహేశ్వరరావు, మండల నా యకులు ఎస్.సింహాచలం, చిరంజీవి, కె.సింహాచలం, ఆర్.కల్యాణ్, ఎల్.సింహాచలంనాయుడు, శంకరచారి, పి.మత్స్యలింగం, పద్మావతి, పరమేశ్ పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం



బూత్ కమిటీ అధ్యక్షురాలు సింహాచలమ్మను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు కూటమి ప్రభుత్వ సహకారం అందిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాడుతున్నట్టు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె. బలరామ్ అన్నారు. మంగళవారం మండలంలోని గూడెంపాతవీధిలో వ్యవసాయ అధికారులు పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంలో రాణించేందుకు అనువుగా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ సహాయకులు మెలకువలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారన్నారు. అధికారుల సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే రాజ్‌మా బీమా పథకంలో ప్రతి రైతుకు చేరాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

దివ్యాంగుల ప్రతిభను గుర్తించాలి : ఎమ్మెల్యే



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సామర్థ్యాన్ని తక్కువ అంచనా వేయవద్దని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాల్లో ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఎంఈవో బాబురావు పడాల్ మాట్లాడుతూ, మండలంలోని 79 మంది ప్రత్యేకమైన విద్యార్థులు ఉన్నారని, భవిత కేంద్రంలో కొనసాగుతున్న కార్యక్రమాలను సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు రాజు, సరోజిని, స్పెషల్ ఇండికేటర్ సింహాచలం, ఫిజియోథెరపీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో వాహన తనిఖీలు

▸ మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తం



తనిఖీలు చేపడుతున్న సీఆర్‌పీఎఫ్, పోలీసులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో మండల కేంద్రంలో స్థానిక ఎస్‌ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరిహద్దులో మావోయిస్టుల ప్రభావం ఉండడంతో పోలీసులు అప్రమత్తమైనట్టు తెలుస్తోంది. మండల కేంద్రం మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. మారుమూల గ్రామాలవైపు వెళ్లే వాహనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. వారోత్సవాల నేపథ్యంలో జోలాపుట్టు, డోడిపుట్టు వెళ్లే రాత్రి బస్సు సర్వీసులను అధికారులు రద్దు చేసి, మండల కేంద్రం వరకు మాత్రమే వాటిని పరిమితం చేశారు.

'రహదారి విస్తరణపై పునరాలోచించాలి'

ముంచంగిపుట్టు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రధాన రహదారుల విస్తరణ పనులపై అధికారులు పునరాలోచించాలని వర్తకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు కోరారు. మంగళవారం దుకాణాలు, గృహాల యజమానులు అత్యవసర సమావేశం నిర్వహించారు. మండల కేంద్రం నుంచి కించాయిపుట్టు, బాపనపుట్టు, పెద్దాపుట్టు, సుజనకోట మార్గాల వైపు సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ చేపట్టడంతో అధిక శాతం పేదలు నష్టపోతారని అన్నారు. విస్తరణ పేరుతో జీవనాధారంగా ఉన్న షాప్‌లను, ఇళ్లను తొలగిస్తే రోడ్డున పడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విస్తరణ నిలుపుదల చేయాలని, లేదా కచ్చితంగా రోడ్డు విస్తరించాల్సి ఉంటే కొంతమేర వెసులుబాటు కల్పించాలని కోరుతూ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నేతలు, షాపులు, గృహాల యజమానులు పాల్గొన్నారు.

గుండె సంబంధిత వ్యాధితో శిశువు మృతి



మృతి చెందిన శిశువు (ఫైల్ ఫొటో)

జి.మాడుగుల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలమామిడి పంచాయతీ చిన్న బంధవీధి గ్రామానికి చెందిన వేముల అర్జున్, రమాకుమారి దంపతుల మూడు నెలల పాప గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... కొద్ది రోజులుగా గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఆ చిన్నారిని ఈనెల ఒకటో తేదీన విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ మంగళవారం మృతి చెందింది.

ఆశ్రమ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్

▸ ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి



కెరియర్ గైడెన్స్ బోధనను పరిశీలిస్తున్న ఏటీడబ్ల్యూవో

చింతపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమశాఖ విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై బోధన ప్రారంభించినట్టు స్థానిక ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి తెలిపారు. మంగళవారం చింతపల్లి బాలికలు, గూడెంకాలనీ బాలూర ఆశ్రమ పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు మార్గదర్శి కార్యక్రమంలో భాగంగా భవిష్యత్తు ఏమి చదవాలి, ఎటువంటి ఉద్యోగాలకు ఎటువంటి కోర్సులు అభ్యసించాలనే అంశాలపై కెరియర్ గైడెన్స్ ఇస్తున్నామన్నారు. ఈ బోధనకు కోసం పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుతం తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతోపాటూ ఉన్నత విద్యలో చదవాల్సిన వృత్తిపరమైన కోర్సులు, ఇంటర్‌లో తీసుకోవాల్సిన గ్రూప్‌లు, అందుబాటులోనున్న టెక్నికల్ కోర్సును వివరిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థికి ఏ రంగంలో ఆసక్తి ఉందో ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహిస్తున్నారన్నారు. అలాగే, విద్యార్థుల విద్యస్థాయి తెలుసుకునేందుకు కలెక్టర్ ఆదేశాలతో ప్రతి పాఠశాలలోనూ బేస్‌లైన్ టెస్టు నిర్వహించామన్నారు. ఈపరీక్ష ఆధారంగా విద్యార్థులను ఏ,బీ,సీ,డీ గ్రేడ్‌లు గుర్తించామన్నారు. చదవడం, రాయడం స్పష్టంగా వచ్చిన విద్యార్థులకు ఏ గ్రేడ్, మిగిలిన విద్యార్థులకు ఇతర గ్రేడ్‌లలో పెట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు డీ, సీ గ్రేడ్లలోనున్న విద్యార్థులను బీ, ఏ గ్రేడ్లలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక బోధన చేస్తున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు మార్గదర్శి కార్యక్రమంతో పాటూ బేస్ లైన్‌టెస్టులో వివిధ స్థాయిలోనున్న విద్యార్థులను ఏ గ్రేడ్‌కి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం, వార్డెన్, హెచ్‌డబ్ల్యూవోలు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, మెనూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం జేపీ కొండలరావు, హెచ్‌డబ్ల్యూవో నూకరత్నం పాల్గొన్నారు.

హమ్మయ్య ఎండ కాసింది

- జి.మాడుగులలో 19.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత



భద్రపరిచిన వరికుప్పలు

పాడేరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో మన్యంలోగత నాలుగురోజులుగా ముసురువాతావరణంకొనసాగగా, మంగళవారం కాస్త తెరిపిచ్చింది. దీంతో ఒక మోస్తరుఎండ కాసింది.నాలుగు రోజులు జల్లులతో కూడిన వర్షంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.అయితే ఈనెల 6, 7 తేదీల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని విపత్తుల సంస్థ ప్రకటించడంతో జనం ఆందోళన చెందుతున్నారు.

మండలాల్లో ఉష్ణో గ్రతల వివరాలు

ఫెంగల్ తుఫాన్‌తో వాతావరణంలో మార్పులతో గతఐదు రోజులుగా ఏజెన్సీలో చలి తీవ్రత తగ్గింది. దీంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పెరిగాయి. జి.మాడుగులలో 19.2 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా, అరకులోయలో 19.3,డుంబ్రిగుడలో 19.6, పెదబయలులో 19.7, జీకేవీలో 20.1, పాడేరులో 20.2, హుకుంపేటలో 20.3, చింతపల్లిలో 20.4 డిగ్రీలసెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జి.మాడుగుల: ముసురు వాతావరణం తగ్గి మంగళవారం నాటికి ఎండ కాసింది. సరిగ్గా వరి కోతలు, నూర్పు పనులు చేపట్టే సమయంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో రైతాంగంలో ఆందోళన నెలకొంది. పలుచోట్ల కోతలు కోయడంతో వరి పనలు పొలాల్లో ఉండిపోయాయి. గత నాలుగు రోజులపాటు వాతావరణం మార్పుతో వీటికి కొద్ది పాటి నష్టం జరిగినట్టు రైతులు తెలిపారు. మంగళవారం ముసురు నుంచి తేరుకోవడంతో రైతాంగం ఊపిరిపీల్చుకున్నారు. రాజ్‌మా రైతులకు మాత్రం నష్టాలు తప్పడంలేదు.

విజ్ఞానయాత్రకు గిరిజన రైతులు



విజ్ఞాన యాత్ర ప్రారంభిస్తున్న అధికారులు

ముంచంగిపుట్టు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు, పెదబయలు మండలాలకు చెందిన 17 మంది గిరిజన రైతులు విజ్ఞాన యాత్రకు మంగళవారం జిల్లా వనరుల కేంద్రం, పాడేరు, విశాఖపట్నం ఆత్మ వారి సౌజన్యంతో ప్రత్యేక బస్సులో పయనమయ్యారు. మంగళవారం ఈ బస్సును అధికారులు ప్రారంభించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌లోని ఇందిరా గాంధీ కృషి విశ్వ విద్యాలయం సందర్శించనున్నారు. చిరుధాన్యాలు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, కాయగూరల సాగులో నారుమడి యాజమాన్యం, నూతన వంగడాలు తదితర వాటిపై 6వ తేదీ వరకు మూడు రోజులు ఈ విజ్ఞాన యాత్రలో రైతులకు, వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు విజయలక్ష్మి, శ్రీనివాసబాబు, లీలావతి పాల్గొన్నారు.

మోదకొండమ్మను దర్శించుకున్న ఎయిర్‌ఫోర్స్ అధికారులు



అమ్మవారి సన్నిధిలో ఎయిర్ ఫోర్స్ అధికారులు

పాడేరు, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి):స్థానిక మోదకొండమ్మను ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారులు సార్జంట్ ఎస్టీజాట్, కార్పరల్ సందీప్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. అనంతరం స్థానిక ఉమానీలకంఠేశ్వర ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్శంగా ఉమానీలకంటేశ్వరుడికి పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఆధ్యాత్మిక కమిటీ సభ్యులు వీవీ రత్నం, తదితరులు స్వాగతం పలికారు. మోదకొండమ్మను, ఉమానీలకంఠేశ్వరుడ్ని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఎయిర్ ఫోర్స్ అధికారులు పేర్కొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం: డీఎస్పీ



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న డీఎస్పీ ప్రమోద్

పాడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హోం గార్డు నారాయణరావు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని స్థానిక డీఎస్పీ ప్రమోద్ అన్నారు. మండలంలో కుజ్జెలి గ్రామానికి చెందిన హోమ్‌గార్డు నారాయణరావు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన మృతుడి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. అలాగే, బాధిత కుటుబానికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. నారాయణరావు కుటుంబాన్ని పోలీసు శాఖ అన్ని విధాలా ఆదుకుంటుందని డీఎస్పీ ప్రమోదు పేర్కొన్నారు.

రహదారులు అధ్వానం.. రాకపోకలకు నరకం!

- హైవేకు అనుసంధానమైన గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తం
- గతుకుల్లో నీరు చేరి చెరువుల్లా మారిన వైనం
- ప్రమాదాలకు ఆస్కారం.. వాహన చోదకుల భయంభయం
- గత ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న పలు గ్రామీణ రహదారులు దారుణంగా తయారయ్యాయి. ఈ మార్గాలు ఆద్యంతం గతుకులు పడ్డాయి. వీటిలో ఇటీవల కురిసిన వర్షాల నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు.

మండలంలోని జాతీయ రహదారి నుంచి అమ్ములుపాలెం, బలిజపాలెం మీదుగా నారపాడు వెళ్లే మార్గాలు అధ్వానంగా తయారయ్యాయి. నారపాడు జంక్షన్ నుంచి మామిడిపాలెం జంక్షన్‌కు వెళ్లే రోడ్డు మరీ దారుణంగా మారింది. దీంతో ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. నారపాడు జంక్షన్ నుంచి మామిడిపాలె వెళ్లే రహదారిలో మోకాలిలోతు గోతులు ఏర్పడడంతో పరిస్థితి ప్రమాదకరంగా తయారైంది. అదే విధంగా నల్లరేగులపాలెం నుంచి నారపాడు జంక్షన్ వరకూ రహదారి అస్తవ్యస్తంగా తయారు కావడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. రహదారిపై రాళ్లు తేలిపోవడంతో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు ఆటోలే ఆధారం. ఆ మార్గాల్లో ఆటోలు తిప్పేందుకు డ్రైవర్లు వెనకాడుతున్నారని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. నారపాడు జంక్షన్ నుంచి మామిడిపాలెం వేళ్ల రోడ్డు సుమారు 300 మీటర్ల మేర కనీస మరమ్మతులకు నోచుకోలేదని, గత ప్రభుత్వంలో పలుసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని ప్రయాణికులు, వాహన చోదకులు, ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఈ రోడ్డును బాగు చేయాలని వారు వేడుకుంటున్నారు.


చెరువును తలపిస్తున్న అమ్ములుపాలెం-మామిడిపాలెం రహదారి..


నల్లరేగులపాలెం-నారపాడు జంక్షన్ మధ్య ఛిద్రమైన రోడ్డు

సమస్య తెలిపినా పట్టించుకోలేదు...



-కుచ్చర్లపాటి రామకృష్ణరాజు, నల్లరేగులపాలెం

నారపాడుపాడు జంక్షన్ నుంచి మామిడిపాలెం జంక్షన్ వరకూ సుమారు 300 మీటర్ల రోడ్డు ధ్వంసమైంది. గతంలో ప్రైవేటు వ్యక్తులు గ్రావెల్, రాళ్లతో కప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. 2017 ముందు పీఆర్ శాఖ ఆధీనంలో ఈ రోడ్డు ఉండేది. తరువాత ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి రోడ్డును ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఈ రోడ్డుకు బాగు చేయడానికి నిధులు మంజూరు చేయాలి.

దాబాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు: సీఐ


దాబా నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దాబాల్లో మద్యం విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు హెచ్చరించారు. పరవాడ ప్రాంతం పరిధిలోని దాబా నిర్వాహకులతో మంగళవారం రాత్రి ఆయన సమావేశమయ్యారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరుపుతున్నట్టు తమ దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. రహదారికి సమీపంలోని దాబాల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాత్రి పది గం గంటలకల్లా దాబాలను మూసివేయాలన్నారు. ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సీఐ సూచించారు.

సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ప్రసాద్


పోటీలకు ఎంపికైన ప్రసాద్‌ను అభినందిస్తున్న బాబీ

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు అనకాపల్లికి చెందిన బాడీ బిల్డర్ పి.ప్రసాద్ ఎంపికయ్యాడని జిల్లా బాడీ బిల్డర్స్ అండ్ ఫిట్నెస్ అసోసియేషన్ కార్యదర్శి శిలపరశెట్టి బాబి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత నెల 30న గుంటూరు జి.ఎస్.ఆర్. జిమ్‌లో జరిగిన సౌత్ ఇండియా సెలక్షన్ ట్రైల్స్‌లో 60 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచాడని తెలిపారు. దీంతో ప్రసాద్ తమిళనాడు అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరువల్లూరులో జరగనున్న సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్, ఫిజిక్స్ స్పోర్ట్స్ చాంపియన్ షిప్-2024 పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈ పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి అనకాపల్లి జిల్లాకే కాకుండా జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని బాబీ ఆకాంక్షించారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు మెసెజ్‌లను చూపిస్తున్న వార్డు ప్రజలు, నాయకులు

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని లంకెలపాలెం సమీపం శ్రీరామ్‌నగర్‌కాలనీలో మంగళవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చురుగ్గా నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. టీడీపీ సభ్యత్వం పొందడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. సభ్యత్వ నమోదు పై కార్యకర్తలంతా దృష్టిసారించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రౌతు వరహా నరసింహమూర్తి, వీరోతి మణి, రమణ, తిరుపతిరావు, రాజేశ్, నాయుడు, కుమార్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ఎన్నో పథకాలు



దివ్యాంగ బాలలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో రవీంద్ర

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నదని ఎంఈవోలు ఎల్.లక్ష్మణరావు, ఎంజే రవీంద్రబాబు చెప్పారు. స్థానిక భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. అనం తరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐఈఆర్‌టీ బి.సింహాద్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరి, ఐఈఆర్‌టీ బేబీరాణి, దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రెల్ల రాల్చే పురుగుతో జర జాగ్రత్త


వరి పొలాలల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తుమ్మపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి పంటపై రెల్ల రాల్చే పురుగు ఉధృతంగా ఉందని, దీంతో రైతులు జర జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి రంగాచారి సూచించారు. మండలంలోని తుమ్మపాల, మార్టూరు గ్రామాల్లో ఆదివారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రెల్ల రాల్చే పురుగు నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందుకోసం ఎసిఫేట్ లీటరు నీటికి 2.5 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే ఫిప్రోనిల్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వరి తర్వాత రెండో పంటగా వేసుకునేందుకు విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడ్డ గుర్తు తెలియని వ్యక్తి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని కొనఊపిరితో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రోత్సాహంతోనే దివ్యాంగుల అభ్యున్నతి

- జాయింట్ కలెక్టర్ జాహ్నవి




పట్నాయక్‌ను సత్కరిస్తున్న దృశ్యం... దివ్యాంగులకు చెక్కులను పంపిణీ చేస్తున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సరైన ప్రోత్సాహం ద్వారానే దివ్యాంగుల అభ్యున్నతి సాధ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి స్పష్టం చేశారు. పట్టణంలోని వీవీ రమణ రైతు భారతిలో మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలను జేసీ జాహ్నవి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది సమగ్ర, స్థిరమైన భవిష్యత్తు కోసం దివ్యాంగుల నాయకత్వాన్ని విస్తరించడం అనే థీమ్‌తో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అన్ని రంగాల్లో విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించడం ద్వారా, వారిని విజేతలుగా నిలబెట్టాలన్నారు. అన్ని రంగాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం నుంచి అన్ని విధాలుగా సహాయ సహకారాలందిస్తామని జేసీ భరోసా ఇచ్చారు. గవర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విభిన్న ప్రతిభావంతుల అభ్యున్నతికి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పింఛన్ పెంచిందని గుర్తు చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వాలు అండగా నిలుస్తున్నాయన్నారు. ముఖ్య అతిథుల చేతుల మీదుగా దివ్యాంగులకు సత్కారాలు చేశారు. అలాగే ఎన్టీఆర్ స్టేడియంలో దివ్యాంగులకు జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగుల ఆర్థిక ఉన్నతికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయిషా, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ జగదీశ్, మెప్మా ప్రతినిధులు, వివిధ విభాగాధిపతులు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట: మండల కేంద్రంలోని పాఠశాల నంబరు-2 భవితా కేంద్రంలో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం జరిగింది. ఎంపీడీవో రవికుమార్ దివ్యాంగుల హక్కులను వివరించారు. దివ్యాంగులకు అందరి కంటే మేధోశక్తి ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పట్టణంలో జరిగిన కార్యక్రమంలో విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావును జేసీ సన్మానించారు. ఎంఈవో-1, 2 సురేశ్, మూర్తి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, నాయకులు వేగి గోపీకృష్ణ, కాండ్రేగుల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

అనకాపల్లి రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పాకలో గల భవిత కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు, మండల విద్యాశాఖాధికారి బి.కోటేశ్వరరావు హాజరై మాట్లాడారు. పిల్లలను పెంచే క్రమంలో తల్లిదండ్రులు మనో నిబ్బరాన్ని కోల్పోకూడదని, పిల్లల్లోని వైకల్యం వారికి తెలియకుండా పెంచాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు అన్ని రంగాల్లో కూడా రాణించగలరని, అందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇచ్చే అలవెన్స్‌లను ఈ వారంలో రిలీజ్ చేస్తామని డీఈవో అప్పారావునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది..

కశింకోట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమవరం, నర్సాపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి స్వప్న వరి పంటలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తుఫాన్ వర్షాలకు వరి పంట కోసేసి, పనలపై కంకులు ఆరబెట్టడం వల్ల మొలకెత్తే ప్రమాదం ఉందన్నారు. ధాన్యం మొలకెత్తకుండా రెండు శాతం ఉప్పు ద్రావణం పనలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఒక లీటరు నీటితో 20 గ్రాముల కల్లు ఉప్పు(గడ్డ ఉప్పు)ను, ఒక ట్యాంకు నీటిలో సుమారు 250 గ్రాములు ఉప్పు కలిపి స్ప్రే చేయాలని ఆమె సూచించారు.

రేషన్ బియ్యం అక్రమాలపై చర్యలు తీసుకోండి: సీపీఐ నేత భద్రం

తుమ్మపాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఐ జోనల్ కార్యదర్శి వైఎన్ భద్రం డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రేషన్ బియ్యం, పప్పులు, పంచదారను కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్లు కాజేసి ఎండీయూ వాహనాల్లోనే దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. పౌర సరఫరాల శాఖ అధికారులకు సమాచారం ఉంటున్నా కనీసం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. బహిరంగంగానే ఈ తంతు సాగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు బియ్యం పంపిణీలో జరుగుతున్న అవకతవకలను గుర్తించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వరి పంటల సంరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరి పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. సీతానగరం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో రంగాచారి పాల్గొని మాట్లాడారు. వరి గింజ రంగు మారకుండా ఉండడానికి లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిం లేదా రెండు గ్రాముల కార్బండిజిం, మాంకోజెబ్ లేదా ఒక మిల్లీలీటరు ప్రొపికొనజోల్ మందును పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సబ్ డివిజన్ అధికారి ఎం.రామారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు జ్యోతిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుప్పట్ల పంపిణీ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసింగరావుపేటలోని లక్ష్మీ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కాసారపు సత్యనారాయణ తన కార్యాలయం వద్ద దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా చైర్మన్ సత్యనారాయణ ఈ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కె.సాంబశివరావు, కె. రాంబాబు, పి. నూకరాజు, సురేష్, శంకర్ పాల్గొన్నారు.

మురుగు కాలువ నిర్మాణానికి సర్వే

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కొత్తూరు దేవీనగర్‌లో మురుగు కాలువల నిర్మాణానికి పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా విభాగం అధికారులు మంగళవారం సర్వే చేశారు. కాలనీలోని కాలువలు నిర్మాణం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఈ మేరకు కాలువ నిర్మాణానికి అంచనా వేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించడంతో ఏఈ బిందు, పంచాయతీ అధికారులు వచ్చి ఈ సర్వే చేపట్టారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 8న జరగాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం వాయిదా వేసినట్టు ఇరిగేషన్ శాఖ జేఈ సాయికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో తుఫాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రభుత్వం ఎన్నికలు వాయిదా వేసిందన్నారు. మరలా ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

నేడు, రేపు ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ పోటీలు

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రతిభ విద్యాలయంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఇంటర్ స్కూల్ బాస్కెట్‌బాల్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు ఆదిరెడ్డి రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొంటారన్నారు. విజేతలకు వరసగా రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని చెప్పారు.

నేరాల నియంత్రణలో భాగం కావాలి

- అనకాపల్లి దిశ డీఎస్పీ శ్రీనివాసరావు


పోస్టర్ ప్రదర్శిస్తున్న డీఎస్పీలు, మహిళా పోలీసులు

నర్సీపట్నం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నేరాలను అదుపు చేయడంలో సచివాలయ మహిళా పోలీసులు భాగం కావాలని అనకాపల్లి దిశ డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. మాదక ద్రవ్యాలు, అత్యాచారాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు, అత్యాచారాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికతో శారీరక సంబంధం పెట్టుకుంటే 20 సంవత్సరాలకు తగ్గకుండా జైలు శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాల వల్ల నష్టాలు, పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్ మాట్లాడుతూ గంజాయి వల్ల మానసిక వైకల్యానికి గురవుతారన్నారు. నేరాలకు సంబంధించిన సమాచారం ఉన్నతాధికారులకు ఇవ్వాలన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులతో కలిసి సంకల్ప్ పోస్టర్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యార్థుల వికాసానికి కృషిచేయాలి

సబ్బవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సాంస్కృతిక వికాసానికి కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి సూచించారు. కళాశాలలో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస, భారతీయ విద్యా వికాసంపై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవన నైపుణ్యాలతో పాటు విద్యా వికాసానికి కావాల్సిన అన్ని లక్షణాలను అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ జిల్లా ప్రతినిధి ఎస్.బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎల్.గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవోలు సాయి శైలజా, దివాకర్‌రావు సూచించారు. స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. సమగ్రశిక్ష పథకంలో భాగంగా దివ్యాంగులకు అలవెన్సు, ఫిజియోథెరపీ తదితర కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. వీటిని చక్కగా వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్, మండల పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.అప్పలనాయుడు, బి.నాగేశ్వరరావు, స్పెషల్ ఎడ్యుకేటర్ ఎస్ఎస్ఎస్.కుమారి, ఫిజియోథెరపిస్టు కిరణ్‌కుమార్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్రీనివాస్, కుమారి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మరిడిమాంబ పండగ పోస్టర్ ఆవిష్కరణ

పరవాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నెలపాలెం ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ అమ్మవారి పండగకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం స్థానిక రామాలయం వద్ద గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. ఈ నెల 5న పండగను అత్యంత వైభవంగా జరపనున్నట్టు వారు తెలిపారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పెద్దింటి వారి సంయుక్త ఆధ్వర్యంలో పండగను జరుపుతామన్నారు. పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి పండగను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెన్నెల ఏకుల అప్పారావు, వెన్నెల వెంకినాయుడు, వెన్నెల నర్సింగరావు, పైలా రథాల సన్యాసిరావు, పైలా రమణాజీ, లోకిరెడ్డి అబీ సన్యాసినాయుడు, వెన్నెల సన్యాసిరావు, పైలా ప్రసాద్, పైలా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పంట.. భలే రుచులంట!

మిద్దెలపై సాగు.. దిగుబడులు బాగు

- సేంద్రియ పద్ధతిలో సత్ఫలితాలు
- ఎరువుల తయారీలోనూ ప్రావీణ్యం
- ఆదర్శంగా నిలుస్తున్న తిరుమలనగర్ కాలనీ వాసులు

నేడు సర్వం కలుషితమై మానవాళి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ విపరిణామాల నుంచి బయటపడేందుకు 'ఇంటి వంట..సొంత పంట' తృప్తినిస్తాయని కొందరు అనుభవ పూర్వకంగా నిరూపిస్తున్నారు. కూరగాయల కోసం మార్కెట్‌కు వెళ్తాం. కానీ వాటిని ఎక్కడ, ఎలా పండించారో, ఏయే ఎరువులు వాడారో మనకు తెలీదు. డబ్బు పెట్టి విషతుల్యమైన ఆహారాన్ని కొని తెచ్చుకుంటాం. అలాకాకుండా మన ఇంటి అవసరాలకు తగ్గ కూరగాయలను మనమే పండించుకోగలిగితే.. ఆ రుచి-తృప్తి అమోఘం. ఇందులో భాగంగా కొంతమంది పెరటితోటల పెంపకానికి ప్రాధాన్యమిస్తుండగా, స్థలం లేని మరికొందరు మిద్దెలను సద్వినియోగం చేసుకుంటున్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ వాసులు సేంద్రియ సాగుతో చక్కని కూరగాయలు పండిస్తున్నారు.

- కూర్మన్నపాలెం, ఆంధ్రజ్యోతి)





తిరుమల నగర్ కాలనీ వాసులు మొక్కల సంరక్షణలోనే ఎక్కువ సమయం గడుపుతారు. వాటికి రోజూ నీళ్లు పోయడం, సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఇందుకోసం గో మూత్రం, నల్ల బెల్లం, బాగా మగ్గిన పండ్లు, కూరగాయల వ్యర్థాలు, ఇంట్లో మిగిలిన అన్నం, బియ్యం కడుగు, గంజి వంటి వాటితో ఎరువులను తయారుచేస్తున్నారు. ఈ క్రమంలో మిద్దెతోట మంచి దిగుబడులు ఇస్తుండడంతో పూలు, పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసి తెచ్చుకొనే అవసరం రాలేదని చెబుతున్నారు. అంతేకాకుండా తమ ఇంట పండిన కూరగాయలను ఇరుగు, పొరుగు వారికి, స్నేహితులకు, బంధువులకు ఇస్తుంటామంటున్నారు.









తిరుమలనగర్‌లో టెర్రస్‌పై పెంచుతున్న పలు రకాల పూలు, పండ్లు, కూరగాయలు మొక్కలు

ఇంట్లోనే సేంద్రియ ఎరువు తయారీ

కాలనీ వాసులకు ఇంటి పంట అంటే మక్కువ. కొంతమంది మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎక్కువ ఫలసాయం వచ్చేందుకు పోషకాలు గల ద్రావణం తయారుచేసి మొక్కలకు అందిస్తున్నారు. కూరగాయల వ్యర్థాలు, అరటి పళ్లు, తెలగ పిండి, వేపాకు, పిండి, చిట్టు, బెల్లం కలిపి నిల్వచేసిన ద్రావణాలను వినియోగిస్తూ, రాలిన ఆకులు, ఎండిన మొక్కలు, ఆవు, గేదె పేడలను సేకరించి ఎరువులను తయారుచేస్తున్నారు.



తాజా కూరగాయలతో ఆరోగ్యం



మా డాబాపై సుమారు 240 రకాల మొక్కలున్నాయి. ఆరేళ్లుగా పెంచుతున్నాను. పూలు, క్రోటాన్ మొక్కలతో పాటు దుంప, వంగ, అరటి, తోటకూర, బచ్చలి, గోంగూర, చుక్క కూర, పుదీనా, కొత్తిమీర, పచ్చిమిర్చి, టమాటా ఉన్నాయి. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వీటిని తింటే ఆరోగ్యం. ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగిపోతున్న తరుణంలో వీటిని పెంచడం ద్వారా డబ్బు కూడా ఆదా అవుతుంది. ఇంట్లో మిగిలిన ఆహార పదార్థాలు, వ్యర్థాలు, ఎరువుగా తయారు చేస్తున్నాం.

- ఎం.పరమానందం

ఆన్‌లైన్‌లో విత్తనాల కొనుగోలు



అభిరుచులకు అనుగుణంగా నర్సరీలు, బంధువుల ఇళ్ల నుంచి, వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు చేసేటప్పుడు మొక్కలు కొనుగోలు, సేకరణ చేస్తుంటారు. వాటిని తీసుకువచ్చి ప్లాస్టిక్ డబ్బాలు, కుండీలు, పనికిరాని వాటిలో మట్టి, ఎరువు నింపి సాగు చేస్తున్నాయం. సేంద్రియ విత్తనాలను, పద్ధతులను ఆన్‌లైన్‌లో నేర్చుకుంటూ, ఎలా పెంచి, దిగుబడిని సాధించాలన్న విషయాలను యాప్‌ల ద్వారా తెలుసుకుంటాం.

- డాక్టర్ ఎ.ప్రభుదాస్, ఉక్కు రిటైర్డ్ జీఎం

ఫార్మా కలుషిత జలాలకు చూడి ఆవు బలి!

అచ్యుతాపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక శివారు పల్లిపేటకు చెందిన మత్స్యకారుడు ఆంగ తాతారావుకు చెందిన ఆవు మంగళవారం ఉదయం మేతకు వెళ్లి ఉప్పుగల్లీల దగ్గర లాలం కోడూరు వైపు నుంచి వచ్చే కాలువలో నీరు తాగింది. ఇంటికి వచ్చిన వెంటనే కిందపడిపోయి నోటి నుంచి నల్లని ద్రవపదార్థం వచ్చింది. క్షణాల్లో చనిపోయింది. దీనిపై తాతారావు మాట్లాడుతూ, ఇటీవల రూ.80 వేలకు ఆవును కొనుగోలు చేశానని, ప్రస్తుతం ఆరు నెలల చూలుతో ఉందని, ఫార్మా కంపెనీలు విడుదల చేసిన రసాయన కలుషిత నీరు తాగడం వల్లనే ఆవు చనిపోయిందని వాపోయాడు. కాగా కలుషిత నీరు తాగడం వల్ల ఆవు చనిపోయిన విషయాన్ని ఏపీఐఐసీ జోన్ మేనేజర్ హరిప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లగా, పశువైద్యుడితో పోస్టుమార్టం చేయిస్తే.. ఏదో ఒక కంపెనీ చేత నష్టపరిహారం ఇప్పిస్తానని సమాధానం చెప్పారని మత్స్యకార నాయకుడు ఉమ్మిడి జగన్ ఆరోపించారు. రసాయన వ్యర్థాలను శుద్ధిచేయకుండా బయటకు విడిచిపెడుతున్న ఫార్మా కంపెనీలపై చర్యలు తీసుకోకుండా, చనిపోయిన ఆవుకు నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పడం దారుణమని అన్నారు. కాగా ఏపీఐఐసీ జడ్ఎం హరిప్రసాద్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఆవు కళేబరానికి పోస్టుమార్టమ్ రిపోర్టు వచ్చిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

ఉప్పుటేరును పరిశీలించిన అధికారులు

ఇదిలావుండగా పూడిమడక తీరంలోకి వస్తున్న కలుషిత నీటిని హార్బర్ రోడ్డు వద్ద గల ఉప్పుటేరులో మంగళవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్, డీజడ్ఎం సూర్యనారాయణ, పర్యావరణ శాఖ ఈఈ ముకుందరావు పరిశీలించారు. ఈ విషయం తెలుసుకుని మత్స్యకార నాయకులు చేపల తాతలు, కొవిరి బంగారయ్య, మైలపల్లి ధనరాజ్, మేరుగు రాజులు తదితరులు అక్కడకు వెళ్లారు. కలుషిత నీరు ఫార్మా కంపెనీల నుంచే వస్తున్నట్టు అధికారులు గుర్తించారు. అయితే కంపెనీల నుంచి నేరుగా ఉప్పుటేరులోకి వచ్చే అవకాశాలు లేవు. ఫార్మా కంపెనీల నుంచి ట్యాంకర్ల ద్వారా రసాయన వ్యర్థాలను తీసుకువచ్చి ఉప్పుటేరులో వదులుతున్నట్టు అనుమానించారు. ఉప్పుటేరు ప్రాంతానికి రావడానికి వున్న నాలుగు మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, వీటి వద్ద స్థానిక మత్స్యకారులనే తనిఖీకి నియమిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

విశాఖ నుంచి కాకినాడ వయా చోడవరం

- దర్జాగా రేషన్ బియ్యం అక్రమ రవాణా
- ఎండీయూ వాహనం వద్దే కొనుగోళ్లు
- కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకూ చెల్లింపు
- డిపోల్లో వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్న మరికొందరు
- వీధుల్లోకి వచ్చే చిరు వ్యాపారులకు అమ్ముకుంటున్న ఇంకొందరు...
- బృందాలుగా ఏర్పడి గుట్టుగా సరకు ఆనందపురం, విజయనగరం, చోడవరం ప్రాంతాల్లో గల మిల్లులకు తరలింపు
- అక్కడ నుంచి కాకినాడ పోర్టుకు...
- డిప్యూటీ సీఎం తనిఖీలతో అధికారులు అప్రమత్తం
- గంగవరం పోర్టులో సోదాలు

(విశాఖపట్నం/గాజువాక/మధురవాడ/జగదాంబ కూడలి-ఆంధ్రజ్యోతి)

పేదలకు ఉచితంగా ఇస్తున్న రేషన్ బియ్యంలో 70 నుంచి 80 శాతం పక్కదారి పడుతోంది. గతంలో రేషన్ డిపోల కేంద్రంగా జరిగిన ఈ కార్యక్రమం ఇప్పుడు మొబైల్ వాహనాల వద్దే సాగుతోంది. పేదలకు ఇచ్చే బియ్యాన్ని చిన్న వ్యాపారులు కొనుగోలు చేసి అనకాపల్లి జిల్లా చోడవరం ప్రాంతంలో గల ఒకటి, రెండు రైస్‌మిల్లుల ద్వారా కాకినాడ తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఐదేళ్లలో రేషన్ బియ్యం కాకినాడకు తరలించడం ద్వారా రూ.కోట్లకు పడగెత్తిన ఇక్కడ మిల్లర్లపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు తాజాగా కొందరు ఫిర్యాదు చేశారు.

విశాఖ జిల్లాలో 5.29 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. అందులో నాలుగున్నర లక్షలకుపైగా కార్డులు నగరంలో ఉండగా, మిగిలినవి ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి గ్రామీణ మండలాల్లో ఉన్నాయి. జిల్లాలో 641 డిపోలు, 314 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా ఎనిమిది వేల టన్నుల బియ్యం కార్డుదారుల కోసం విడుదల చేస్తున్నారు. అయితే మెజారిటీ కార్డుదారులు రేషన్ బియ్యం తినేందుకు ఇష్టపడడం లేదు. కొందరు మొబైల్ వాహనదారుల వద్దే బియ్యం వదిలేసి కిలోకు రూ.12 నుంచి రూ.15 వరకూ (ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రేటు ఉంది) తీసుకుంటున్నారు. మరికొందరు ఉదయం, సాయంత్రం పూట డిపోలకు వెళ్లి అక్కడ వేలిముద్ర వేసి బియ్యానికి బదులు సొమ్ములు తీసుకుంటున్నారు. మరికొందరు మొబైల్ వాహనం వద్ద బియ్యం తీసుకుని ఇంటికి తీసుకువెళ్లి సమీపంలో కిరాణా దుకాణాలు/వీధుల్లో బియ్యం కొనుగోలు చేసే చిరు వర్తకులకు కిలో రూ.14 నుంచి రూ.17కు అమ్ముకుంటున్నారు. కార్డుదారుల నుంచి కొనుగోలు చేసే బియ్యంలో కొంత శాతం నగరంలో టిఫిన్ దుకాణాలు, మెస్‌లు, హోటళ్లకు వెళుతోంది. మిగిలింది ఆటోలు, వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఆటో డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. బియ్యం తరలింపు ప్రక్రియ మొత్తం పౌర సరఫరాల శాఖకు చెందిన చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు తెలుసుననేది బహిరంగ రహస్యం. మధురవాడ ప్రాంతంలో ఒక చెకింగ్ ఇన్‌స్పెక్టరు ఆదాయం నెలకు రూ.లక్షల్లో ఉందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. డీలర్లు, మొబైల్ వాహనాలతోపాటు మధురవాడ మీదుగా బియ్యం తరలించే ఆటోల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమ బియ్యం వ్యాపారంతోనే వన్‌టౌన్ ప్రాంతంలో గతంలో కలాసీగా పనిచేసిన ఒక వ్యక్తి ఇప్పుడు కోట్లు సంపాదించారని ఆ ప్రాంతంలో డీలర్లు చెబుతుంటారు. గాజువాక, షీలానగర్, గోపాలపట్నం, పెందుర్తి, మధురవాడ ప్రాంతాల నుంచి ఆనందపురం, పెందుర్తి మీదుగా చోడవరం ప్రాంతానికి భారీగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయి. కొందరు ఆనందపురం పరిసరాల్లో మిల్లులకు అమ్ముతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో మిల్లులకు విక్రయిస్తున్నారు. చోడవరం ప్రాంతానికి వెళ్లే రేషన్ బియ్యానికి కొంత పాలిష్ పెట్టి కాకినాడ తరలిస్తున్నారు. ఒక్కొక్కసారి వచ్చిన బియ్యం వచ్చినట్టే కాకినాడకు పంపుతుంటారు. ఈ వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఒకరు స్వయంగా ఫిర్యాదు చేశారు.



తనిఖీలు చేస్తున్న దృశ్యం

గంగవరం పోర్టులో తనిఖీలు

కాకినాడ పోర్టు నుంచి ఆఫ్రికా దేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి చేసే నౌకను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పట్టుకున్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో రేషన్ బియ్యం అక్రమాల గుట్టు తేల్చాలని ప్రభుత్వం ఆదేశించింది. విశాఖలో జేసీ మయూర్ అశోక్ కొద్దిరోజులుగా రేషన్ బియ్యం వ్యాపారంపై నిఘా పెట్టారు. ఆయన ఆదేశాల మేరకు పౌర సరఫరాల శాఖ అడపాదడపా దాడులు చేస్తుంది. తాజాగా కాకినాడ వ్యవహారంతో పౌర సరఫరాల గాజువాక ఏఎస్‌వో సోమవారం సాయంత్రం గంగవరం పోర్టును తనిఖీ చేశారు. గంగవరం పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు లేవని నిర్ధారించారు. విశాఖ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులను తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఇందుకు జిల్లా యంత్రాంగం ద్వారా పోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంది. సోమవారం రాత్రి మల్కాపురం ప్రాంతంలోని క్రాంతినగర్, గాజువాక వుడా కాలనీల్లో రెండు ఇళ్లపై జిల్లా పౌర సరఫరాల అధికారి భాస్కరరావు దాడి చేసి 40 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. కాగా నగరంలో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసే ఇళ్లు, దుకాణాలపై దాడులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ కాలువలో పడి వృద్ధురాలి మృతి



నూకాలమ్మ మృతదేహం

నాతవరం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని తాండవ ఎడమ కాలువ వద్ద దుస్తులు ఉతకడానికి వెళ్లిన ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని గాంధీనగరం గ్రామానికి చెందిన కండెలి నూకాలమ్మ(65) ఒంటరిగా జీవిస్తోంది. ఆమె మంగళవారం మధ్యాహ్నం దుస్తులు ఉతకడానికి తాండవ ఎడమ కాలువ వద్దకు వెళ్లింది. దుస్తులు ఉతుకుతున్న క్రమంలో ప్రమాదవశాత్తూ కాలువలో జారి పడి కొట్టుకుపోయింది. కొద్ది దూరంలోనే శవమై తేలింది. స్థానికులు గుర్తించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

40 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను చూపుతున్న ఏసీపీ త్రినాథ్, సీఐ మల్లేశ్వరరావు

కూర్మన్నపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై తరలిస్తున్న నలభై కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు ఆదివారం రాత్రి మంగళపాలెం వద్ద తనిఖీలు నిర్వహించారన్నారు. ఇంతలో పాడేరు నుంచి దువ్వాడ రైల్వే స్టేషన్‌కు పల్సర్ బైక్‌పై నర్సీపట్నం పరిధి గురందొరపాలేనికి చెందిన పూడి శ్రీనివాస్, రోలుగుంట మండలం రత్నంపేటకు చెందిన గుమ్మడి ఉపేంద్ర, కశింకోట మండలం గోకివానిపాలేనికి చెందిన సారిపల్లి రామకృష్ణలు వస్తున్నారన్నారు. అనుమానం వచ్చి వీరిని తనిఖీ చేయగా, రెండు గోనె సంచుల్లో రెండు కిలోలు చొప్పున 20 గంజాయి ప్యాకెట్లు పట్టుబడినట్టు చెప్పారు. వీరి వద్ద నుంచి గంజాయి, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్టు చెప్పారు. నిందితుల్లో గుమ్మడి ఉపేంద్ర, సారిపల్లి రామకృష్ణ ఇద్దరూ గంజాయి కేసులో పాత నేరస్థులేనని వివరించారు. సీఐ మల్లేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి తాగినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. ఇటువంటి వారి వివరాలు తెలిసినవారు తమకు సమాచారం ఇస్తే గోప్యంగా ఉంచడంతో పాటు బహుమతులు ఇస్తామన్నారు.

20 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

నక్కపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద ఆదివారం స్వాధీనం చేసుకున్న గంజాయి కేసుకు సంబంధించి ఇరువురు నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన వెదుళ్లపాలెం హైవే జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులు బ్యాగులతో నిలబడి వుండగా, పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారని చెప్పారు. బ్యాగుల్లో 20 కిలోల గంజాయి లభ్యం కావడంతో చింతపల్లి మండలం కట్టుబండ గ్రామానికి చెందిన తాంబెల్లి ఆమోజు, కంఠ నర్సింగ్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

వూడేరులో 150 కిలోల గంజాయి పట్టివేత

కొత్తూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వూడేరు గ్రామ సమీపంలో రూరల్ పోలీసులు భారీఎత్తున గంజాయి పట్టుకున్నట్టు స్థానికుల ద్వారా తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మాటువేయగా కారులో తరలిస్తున్న సుమారు 150 కిలోల గంజాయి పట్టుకున్నట్టు సమాచారం. దీనిపై రూరల్ పోలీసులను వివరణ కోరగా.. విచారణ జరుగుతున్నదని, వివరాలను బుధవారం వెల్లడిస్తామని తెలిపారు.

రైలు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక లక్ష్మీదేవిపేట రైల్వే గేటు వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా రైలు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌పీఎఫ్ అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి, గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు.

మామ ఇంటికి అల్లుడు కన్నం!

- ఏడు తులాల బంగారం అపహరణ
- నిందితుడి అరెస్టు

రోలుగుంట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శరభవరంలో ఓ ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం జరిగిన చోరీకి సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి 7 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామానికి చెందిన ఊట చిన రాజు తన ఇంట్లో 7 తులాల బంగారం చోరీకి గురైందని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్‌టీంతో పాటు నేరస్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. చుట్టుపక్కల ఉన్నవాళ్లను విచారించారు. ఆదివారం మధ్యాహ్నం అతని అల్లుడైన లాలం సింహాచలం ద్విచక్ర వాహనంపై వచ్చి వెళ్లాడన్న సమాచారంతో పోలీసులు విచారణ చేపట్టారు. ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగులగొట్టి బీరువా తెరిచి ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్టు గుర్తించారు. నిందితుడి కాల్ డేటా ఆధారంగా నర్సీపట్నంలో పట్టుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

సీఎం రాక రేపు

... 5వ పేజీ తరువాయి

నిర్వహిస్తోంది. దీనికి ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఠక్కర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సదస్సులో ప్రసంగించిన అనంతరం చంద్రబాబునాయుడు సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం పార్టీ కార్యాలయానికి కూడా వెళతారు.

ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ ఆరా!

... 5వ పేజీ తరువాయి

ఎటువంటి విచారణ చేపట్టకుండా ఫిర్యాదును నాటి పాలకులు తొక్కిపెట్టేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనకాపల్లి, సబ్బవరం, పరవాడ మండలాల్లో ల్యాండ్ పూలింగ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తామని నేతలు హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ కూడా ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై విచారణ జరిపిస్తామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై విచారణ చేపట్టాలని ఇటీవల జనసేన, టీడీపీ నాయకులు కోరడంతో కూటమి ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది.

అనకాపల్లి, పరవాడ, సబ్బవరం మండలాల్లో ల్యాండ్ పూలింగ్ అక్రమాలపై సీఐడీ అధికారి నాగేంద్రభూపాల్ నేతృత్వంలో మూడు బృందాలు తనిఖీలు చేపట్టడంతో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది. అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సీఐడీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. తహసీల్దారుల కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన సీఐడీ అధికారులు ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. భూములు ఇచ్చిన వారిలో వైసీపీ నేతలు, వారి బినామీల పేర్లు ఎన్ని వున్నాయో పరిశీలించినట్టు తెలిసింది.

అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయంలో...

అనకాపల్లి టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మంగళవారం ఉదయం సీఐడీ అధికారులు వచ్చారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఇక్కడే వున్నారు. అయితే ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించలేదు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు సీఐడీ డీఎస్పీ నాగేంద్రభూపాల్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది.. ల్యాండ్ పూలింగ్‌కు సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనకాపల్లి మండలంలోని కూండ్రం, కుంచంగి, మామిడిపాలెం, కోడూరు గ్రామాల్లో జరిగిన భూ సమీకరణకు సంబంధించిన రికార్డులతోపాటు ఆయా గ్రామాల్లో భూ సమీకరణ జరిగిన ప్రదేశాలను కూడా పరిశీలించినట్టు రెవెన్యూ వర్గాల ద్వారా తెలిసింది. సీఐడీ అధికారులు మరో రెండు, మూడు రోజులపాటు క్షుణ్ణంగా తనిఖీలు, విచారణ జరుపుతారని సమాచారం.

అసంక్రమిత వ్యాధులకు చెక్

... 5వ పేజీ తరువాయి

వ్యక్తి ఎత్తు, బరువు, బీపీ, షుగర్ పరీక్షలు చేస్తున్నారు. మహిళలో రొమ్ము, గొంతు, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ లక్షణాలు తెలియజేసి అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధుల లక్షణాలతో ప్రశ్నాపత్రం ఇచ్చి కుటుంబ సభ్యుల నుంచి జవాబులు రాబట్టి నమోదు చేస్తున్నారు. ధూమపానం, మద్యపానం వున్న వారి వివరాలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకుంటున్నారు. గుండె, ఊపరితిత్తులు, క్యాన్సర్ వ్యాధి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి పంపించి వైద్య సహాయం అదజేస్తారు. జిల్లాలో 5,72,459 కుటుంబాల్లో 18 ఏళ్ల దాటినవారు 13,55,836 మంది ఉండగా ఇప్పటి వరకు 27,601 కుటుంబాలకు సంబంధించి 76,663 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు.

రూ.78 కోట్లతో అభివృద్ధి పనులు

... 5వ పేజీ తరువాయి

జంక్షన్ నుంచి మన్యపురట్ల గ్రామం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరు చేశామని ఆయన తెలిపారు. నాతవరం మండలంలో ప్రతి పంచాయతీలో శ్మశానవాటికల అభివృద్ధి పనులకు రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నట్టు అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. తాండవ రిజర్వాయర్ ఎత్తిపోతల పథకానికి త్వరలో రూ.2,400 కోట్లు మంజూరు చేస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తెలుగుదేశం నాయకులు కరక సత్యనారాయణ, నందిపల్లి వెంకటరమణ, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, కూటమి పార్టీల నాయకులు ఎన్.విజయ్‌కుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, పారుపల్లి కొండబాబు, కొండ్రు మరిడయ్య, తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్‌అండ్‌బీ డీఈ విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు రక్షణ!

... 5వ పేజీ తరువాయి

పాఠశాలలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పాఠశాలల ఆవరణల్లోకి పశువులు రాకుండా, స్థలాలు ఆక్రమణకు గురవకుండా వుండడానికి ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించింది. జాతీయ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో సమగ్ర శిక్షా అభియాన్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రహరీ గోడల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది.

జిల్లాలో తొలి విడత 142 పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.19.98 కోట్లు మంజూరు చేసింది. రూ.10 లక్షల లోపు అంచనాలతో మంజూరైన 44 పాఠశాలల గోడల నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగిలిన 98 పాఠశాలలకు రూ.10 లక్షలకు పైబడి అంచనాతో పనులు చేపట్టాల్సి ఉంది. అయితే ఈ పనులు చేపట్టేందుకు సమగ్ర శిక్షా అభియన్ పథకం మార్గదర్శకాలు అడ్డంకిగా మారండంతో ఒకింత ఆలస్యం అవుతున్నదని ఎస్ఎస్ఏ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ నరసింగరావు తెలిపారు. కలెక్టరు ఆదేశాల మేరకు పాఠశాలలకు ప్రహరీ గోడల నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలని లేఖ రాశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. మొదటి దశలో మంజూరైన అన్ని పాఠశాలలకు ఈ నెలాఖరునాటికి ప్రహరీ గోడల నిర్మాణం పూర్తవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	92.00
లైవ్ ధర	112.00
విత్ స్కిన్	194.00
స్కిన్ లెస్	204.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614